# జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక

సంపుటి: 11 సంచిక: 340 బుధవారం 02-07-2025 పేజీలు: 08 వెల రూ. 3 www.epaperjournalistdiary.com


## ఆల్కలాయిడ్ కంపెనీలో పేలుడు

షాపూర్‌కు చెందిన ఓ కార్మికుడికి గాయాలు

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఘటన



2లో..



# బతుకులు బుగ్గి!

పాశమైలారం రసాయన పరిశ్రమ పేలుడులో 50 మందికి పైగా దుర్మరణం

14 మంది మృతదేహాల గుర్తింపు.. దాదాపు 20 మృతదేహాలకు డీఎన్ఏ టెస్టులు

మృతుల్లో ఆరుగురు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల వారు

తమవాళ్ల జాడ తెలియక బంధువుల రోదనలు

ఘటనా స్థలంలోనే కాలిబూడిదైన చాలామంది కార్మికులు, సిబ్బంది

బాధితులను ఓదార్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

తక్షణ సాయంగా రూ. లక్ష చొప్పున పరిహారం ప్రకటన

మరో కోటి రూపాయలు ఇప్పించే ప్రయత్నం చేస్తానని హామీ

**పటాన్చెరు,జులై 1 :** పాశమైలారం రసాయన పరిశ్రమలో సోమవారం సంభవించిన భారీ పేలుడు పెను విషాదం నింపింది. ఈ ప్రమాదంలో దాదాపు 50 మందికి పైగా చనిపోయినట్టు తెలుస్తున్నది. భారీగా ఎగిసి పడిన మంటల్లో చిక్కుకొని కార్మికులు, సిబ్బంది అక్కడికక్కడే కాలి బూడిదయ్యారు. మృతదేహాలను గుర్తించడం అధికారులకు ఇబ్బందికరంగా మారింది. ఇప్పటి వరకు 13 మంది మృతదేహాలను గుర్తించినట్టు తెలిసింది. మరో 20 మందికి పైగా డీఎన్ఏ టెస్టుల కోసం శాంపిళ్లు సేకరించినట్టు అధికారులు మిగతా 2వ పేజీలో..

## సిగాచి ఓనర్ పై సీఎం ఫైర్

ఇంత పెద్ద ప్రమాదం జరిగినా అడ్రస్ లేకుండా పోయారని మండిపాటు

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు

మృతుల కుటుంబాలకు రూ. లక్ష చొప్పున తక్షణ ఆర్థిక సాయం ప్రకటన

మరో కోటి రూపాయల చొప్పున ఇప్పిస్తానని హామీ



2

# సల్లవడ్డ ఉడుకు రక్తం!




బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎంపికపై శ్రేణుల్లో నైరాశ్యం

సొంత పార్టీ కార్యకర్తల్లోనే తీవ్ర అసంతృప్తి

దాదాపు పదేండ్లుగా దూకుడుగా ఉన్న పార్టీ

ఇప్పుడు 50 ఏండ్ల వెనక్కి వెళ్లిందంటూ అసహనం

తెలంగాణలో ఇక పార్టీ అధికారం కలేనంటూ వ్యాఖ్యలు

మరోవైపు బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రతి విమర్శలు

చంద్రబాబు డైరెక్షన్‌లోనే తెలంగాణ బీజేపీ అధ్యక్షుడి ఎన్నిక అంటున్న గులాబీ నేతలు

కేసీఆర్ డైరెక్షన్‌లోనే బీజేపీ ఢిల్లీ పెద్దల నిర్ణయం అంటున్న కాంగ్రెస్ నాయకులు

రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా బీజేపీ నిర్ణయం

ఈటల, బండి, అర్వింద్, రాజాసింగ్‌లో ఎవరికీ ఇవ్వకపోవడంతో కార్యకర్తల్లో సన్నగిల్లిన ఉత్సాహం

రాజాసింగ్ రాజీనామాతో మరింత నిరుత్సాహం

మరోవైపు ఈటలకు చెక్ పెట్టేందుకేనన్న ఊహాగానాలు

**ప్రత్యేక ప్రతినిధి :** తెలంగాణలో బీజేపీ అధ్యక్షుడి ఎంపికపై ఆ పార్టీ శ్రేణుల్లోనే అసంతృప్తి వ్యక్తమవుతున్నదా? బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావును అధిష్ఠానం ఖరారు చేయడం వారికి అస్సలు మింగుడు పడడం లేదా? తమ నాయకుడిని కాదని అజ్ఞాత వ్యక్తిని తీసుకొచ్చి పార్టీ పగ్గాలు అప్పగించడంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారా? అధిష్ఠానం నిర్ణయంపై బండి సంజయ్, ఈటల, మిగతా 2వ పేజీలో..



# బనకచర్లపై బీఆర్ ఎస్ అలుపెరుగని పోరు

మేము నిలదీయడం వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడింది

కేంద్ర అనుతులు ఇవ్వకపోవడం బీఆర్ ఎస్ విజయమే

అపెక్స్ మీటింగ్ కు రేవంత్ ప్రభుత్వం ఎందుకు డిమాండ్ చేయలే?

చంద్రబాబుకు గురుదక్షిణకు ఇది నిదర్శనం కాదా?

మాజీ మంత్రి హరీశ్ రావు మండిపాటు

**హైదరాబాద్,జులై 1:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టు బనకచర్ల విషయంలో కాంగ్రెస్ను మొద్దు నిద్ర లేపింది బీఆర్‌ఎస్ పార్టీ అని మాజీ మంత్రి హరీశ్రావు పేర్కొన్నారు. ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు తిరస్కరించే వరకు అలుపెరుగని పోరాటం చేసింది బీఆర్‌ఎస్ పార్టీ అని తెలిపారు. గోదావరిలో 1000 టీఎంసీలు, కృష్ణాలో 500 టీఎంసీలు చాలు అని చెప్పిన రేవంత్ కు.. మిగులు జలాల్లోనూ తెలంగాణకు వాటా ఉంటుందని జ్ఞానోదయం చేసింది బీఆర్‌ఎస్ పార్టీ అని పేర్కొన్నారు. అవే పాత అబద్దాలు ప్రచారం చేస్తున్న రేవంత్ రెడ్డి.. అపెక్స్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ఇప్పటికీ ఎందుకు డిమాండ్ చేయడం లేదని మిగతా 2వ పేజీలో..

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నం

రాష్ట్ర వ్యాప్తంగా 594 మండలాల్లో 10,226 సదస్సులు


మొత్తం 8,27,230 దరఖాస్తులు వచ్చినయి

వాటిలో ఇప్పటి వరకు 7,98,528 దరఖాస్తుల డేటాను భూభారతి పోర్టల్‌లో నమోదు చేసినం

ప్రతి ఒక్క దరఖాస్తును పరిశీలించి పరిష్కరిస్తాం

రెవెన్యూ అధికారులతో మంత్రి పొంగులేటి

తిరస్కరణపై దరఖాస్తు దారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశాలు



**హైదరాబాద్,జులై 1:** తెలంగాణలో భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి దరఖాస్తుపై సమగ్ర పరిశీలన ఉంటుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. అన్నింటినీ పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. మంగళవారం రెవెన్యూ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. భూ సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ఏప్రిల్ 17 నుంచి జూన్ 20 మిగతా 2వ పేజీలో..



2

## హర్యానా అతలాకుతలం

భారీ వర్షాలతో ఉప్పొంగిన వరదలు

పలు ప్రాంతాలు జలమయం

షుగర్ ఫ్యాక్టరీలో కొట్టుకు పోయిన చక్కెర

## ఆవిష్కరణలకు ప్రోత్సాహం

ఆర్డీఐలో ప్రైవేటు రంగ పెట్టుబడులకు వడ్డీ రహిత ఫైనాన్సింగ్

ఈ స్కీమ్కు రూ.లక్ష కోట్లు కేటాయింపునకు కేబినెట్ ఆమోదం

జాతీయ క్రీడా విధానం -2025కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం


కేబినెట్ కీలక నిర్ణయాలు

వెల్లడించిన మంత్రి అశ్విని వైష్ణవ్

2



# ఇందిరమ్మ రాజ్యం వచ్చింది.. పాత రోజులు తెచ్చింది



కాంగ్రెస్ పాలనలో రైతులకు ఇబ్బందులు

యూరియా కోసం తప్పని పడిగాపులు

ఎఫ్టీఎల్, బఫర్ జోన్లో పెద్దల నిర్మాణాలు

ప్రభుత్వానికి, సీఎం రేవంత్కు కనిపించవు

నిరుపేదల ఇండ్ల పైనే హైడ్రా ప్రతాపం

మాజీ మంత్రి కేటీఆర్ మండిపాటు

**హైదరాబాద్,జులై :** ఇందిరమ్మ రాజ్యం వచ్చింది.. మళ్లీ పాత రోజులను తిరిగి తెచ్చిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం ఎక్స్ వేదికగా విమర్శించారు. యూరియా కోసం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండలంలో రైతులు, మహిళలు బారులు తీరారని, ఇది నేటి కాంగ్రెస్ విఫల పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ మేరకు మిగతా 2వ పేజీలో..

## రైల్ వన్ యాప్ వచ్చిందోచ్

అందుబాటులోకి అన్ని రకాల సేవలు

ప్రయాణికులకు రైల్వే శాఖ సదుపాయం

లాగిన్ ఫీచర్లు కూడా సులభం

## ఏసీబీ వలలో అవినీతి చేప

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ జీహెచ్ఎంసీ ఉద్యోగి

80 వేలు లంచం డిమాండ్..

30 తీసుకుంటుండగా మాటు వేసి పట్టుకున్న అవినీతి నిరోధక శాఖ

# కాళేశ్వరం .. కమీషన్ల కోసమే

మూడేళ్లకే అది కూలేశ్వరంగా మారింది

నీళ్లు ఫామ్ హౌజ్ కు.. నిధులు కేసీఆర్ కు

రాష్ట్రాన్ని బీఆర్ ఎస్ నాశనం చేసింది

60 వేల ఇండ్లు మంజూరు చేసే సగం కూడా ఇవ్వలే

మా ప్రభుత్వంలోనే నియోజకవర్గానికి 3500 ఇండ్లు

నిజామాబాద్, జహీరాబాద్ ఉమ్మడి జిల్లాల విస్తృత స్థాయి సమావేశంలో మంత్రి సీతక్క



**నిజామాబాద్,జులై 1 :** బీఆర్‌ఎస్ ప్రభుత్వం కట్టిన మూడేళ్లకే కాళేశ్వరం కూలేశ్వరంగా మారిందని జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క ఎద్దేవా చేశారు. కేవలం కమీషన్ల కోసం కట్టిన ప్రాజెక్ట్ గురించి గొప్పలు చెప్పుకోవడం బీఆర్‌ఎస్ నేతలకు అలవాటుగా మారిందన్నారు. మంగళవారం నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ మిగతా 2వ పేజీలో..

## అమ్రాబాద్ టైగర్ ఫారెస్ట్ మూసివేత

జంతువుల సంతానోత్పత్తి కోసం చర్యలు

మూడు నెలల పాటు ఎంట్రీ బంద్

అటవీ శాఖ వన్యప్రాణి విభాగం ప్రకటన

సందర్శకులు సహకరించాలని విన్నపం

## ఆల్కలాయిడ్ కంపెనీలో పేలుడు

**మేడ్చల్, జూలై 1 :**
పాశమైలారం పారిశ్రామిక వాడలోని ఫార్మా కంపెనీలో సోమవారం భారీ పేలుడు ఘటన తరహాలోనే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మంగళ వారం ప్రమాదం జరిగింది. మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కంపెనీలో పేలుడు సంభవించింది. మేడ్చల్ పారిశ్రామికవాడలోని ఆల్కలాయిడ్ కంపెనీలో బాయిలర్ పేలి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. షాపూర్ కు చెందిన మూల శ్రీనివాస్ రెడ్డి గత 12 ఏండ్లుగా కంపెనీలో పనిచేస్తున్నాడు. ఉదయం కంపెనీలో బాయిలర్ పేలడంతో అతను కుప్పకూలిపోయాడు.తోటి కార్మికులు అతడిని స్థాని కంగా ఉన్న ఒక ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కాగా ఈ విషయం బయటకి రాకుండా కంపెనీ యాజమాన్యం గోప్యంగా ఉంచింది.

## హర్యానా అతలాకుతలం

**చండీఘడ్, జూలై 1 :**
భారీ వానలతో హర్యానాలో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. యమునానగర్ లోని సరస్వతి షుగర్ మిల్ ప్రాంగణంలోకి నీరు చేరింది. దాంతో ఆసియాలో అతిపెద్ద షుగర్ మిల్లుగా పేరు గాంచిన దానిలో కోట్ల రూపాయల విలువ చేసే పంచదార కరిగిపోయింది. యమునానగర్ ప్రాంతంలోని గిడ్డంగిలో 2.20 లక్షల క్వింటాళ్ల చక్కెరను నిల్వ చేశారు. దాని మొత్తం విలువ రూ.97 కోట్లు. అయితే వర్షాల కారణంగా పక్కనున్న కాలువ పొంగి నీరు మిల్లులోకి చేరిందని సరస్వతి షుగర్ మిల్ జనరల్ మేనేజర్ రాజీవ్ మిశ్రా వెల్లడిరచారు. రాత్రి భారీ వర్షంతో మిల్లు ప్రాంగణంలోకి నీరు వస్తోందని అర్ధరాత్రి సమయంలోతమ సిబ్బంది అప్రమత్తం చేశారని, మిల్లు పక్కనున్న కాలువ ఆక్రమణకు గురికావడంతో దానిలో నీరు ఒక్కసారిగా పొంగిందని చెప్పారు. ఆ నీరు మిల్లు లోకి చేరడంతో క్వింటాళ్ల కొద్దీ పంచదార తడిసిపోయిందన్నారు. దాని విలువ రూ50 నుంచి 60 కోట్ల వరకు ఉంటుందని , ఒకసారి గిడ్డంగి మొత్తాన్ని పరిశీలించి పూర్తి నష్టాన్ని వెల్లడిస్తామని తెలిపారు. మిల్లులోకి ఇలా వరద నీరు రావడం ఇదే తొలిసారని, రూ. కోట్లలో నష్టం వచ్చినా, స్థానిక మార్కెట్లలో పంచదార లభ్యతపై ప్రభావం ఉండదని మిశ్రా వెల్లడిరచారు. మిల్లు లోని నీటిని తొలగించడానికి అధికారులు క్రేన్ను వినియోగిస్తున్నారు.

## ఏబీసీ వలలో అవినీతి చేప

**హైదరాబాద్, జూలై 1 :**
లంచం తీసుకుంటుండగా జీహెచ్ఎంసీ మూసాపేట్, సీనియర్ అసిస్టెంట్ ను ఏసీబీ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. జీహెచ్ఎంసీ, మూసాపేట్ సర్కిల్ 23లో, ఎం .సునీత సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తోంది. కాగా తన తల్లి పేరుపై ఉన్న ఆస్తిని తన పేరుపై మార్చి మ్యూటేషన్ చేయాలని ప్రాపర్టీ ట్యాక్స్ విభాగంలో పనిచేస్తున్న సునీతను ఓ వ్యక్తి సంప్రదించాడు. ఈ పనిచేసేందుకు సునీత రూ.80,000 లంచం డిమాండ్ చేసింది. పలుమార్లు కలిసి బతిమిలాడగా చివరకు రూ.30,000కు చేస్తానని, అంతకంటే తక్కువకు చేయనని చెప్పింది. దీంతో విసిగిపోయిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు సునీతకు రూ.30,000 ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. అరెస్టు చేసి నాంపల్లి లోని ఏసీబీ కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించింది. నిందితురాలిని ఏసీబీ అధికారులు చంచల్ గూడ జైలుకు తరలించారు.

## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**మొదటి పేజీ తరువాయి**
వరకు దశల వారీగా రెవెన్యూ సదస్సులను నిర్వహించినట్లు వివరించారు. రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తులు, వాటిని భూభారతి పోర్టల్లో నమోదు ప్రక్రియ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి అర్హమైన వాటిని పరిష్కరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రతి దరఖాస్తుపై సరైన విచారణ జరపాలని, సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయాలని మంత్రి సూచించారు. అవసరమైన డాక్యుమెంట్లు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి ఆధారాలన్నింటినీ ఒకే డాక్యుమెంట్గా భూభారతి పోర్టల్లో అప్లోడ్ చేయాలన్నారు. తిరస్కరణకు గురైన దరఖాస్తులను ఎందుకు తిరస్కరించాల్సి వచ్చిందో వివరాలను రాతపూర్వకంగా దరఖాస్తుదారులకు పంపాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 594 మండలాల్లో 10,226 రెవెన్యూ సదస్సులు నిర్వహించి తద్వారా వచ్చిన 8,27,230దరఖాస్తుల్లో ఇప్పటి వరకు 7,98,528 దరఖాస్తుల డేటాను భూభారతి పోర్టల్లో నమోదు చేసినట్లు మంత్రి వివరించారు. మిగిలిన వాటిని కూడా ఒకటి రెండు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. సర్వే నంబర్లలో లోపాలు పీపీబీ, ఆర్వోఆర్, నాలా, ఆర్ఎస్ఆర్ సవరణ, అప్పీల్స్, కోర్టు కేసులు, పోడు భూములు తదితర 30 రకాల భూ సమస్యలకు చెందిన 8.27 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యం వచ్చింది.. పాత రోజులు తెచ్చింది

**మొదటి పేజీ తరువాయి**
యూరియా కోసం వందలాది మంది రైతులు ఇబ్బంది పడుతున్న వీడియోను ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. తమ ఇళ్లు కూల్చొద్దని, హైకోర్టు స్టే ఆర్డర్ ఉన్నదని నిరుపేదలు నెత్తీ నోరు బాదుకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం కనికరం చూపకపోవడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి కొడంగల్ లో రెడ్డికుంటను పూడ్చి మహల్ కట్టవచ్చు, ఆయన అన్న తిరుపతి రెడ్డికి దుర్గం చెరువు ఎఫ్టీఎల్ లో ఇల్లు ఉండొచ్చు.. రెవెన్యూ మంత్రి హిమాయత్ సాగర్ లో ప్యాలెస్ లు కట్టవచ్చు.. చీఫ్ విప్ మహేందర్ రెడ్డి చెరువు నడుమ గెస్ట్ హౌస్ కట్టవచ్చు.. కేవీపీ లాంటి పెద్దలు చెరువు బఫర్ జోన్ లో గెస్ట్ హౌసులు కట్టుకోవచ్చు.. పెద్ద బిల్డర్లు సీఎంకు లంచం ఇచ్చి మూసీ నదిలోనే అపార్ట్మెంట్స్ కట్టుకోవచ్చు.. కానీ సీఎం రేవంత్ రెడ్డికి, హైడ్రాకు ఇవేవీ కనబడవు అని ఎద్దేవా చేశారు.

## బనకచర్లపై బీఆర్ ఎస్ అలుపెరుగని పోరు

**మొదటి పేజీ తరువాయి**
ప్రశ్నించారు. చంద్రబాబు పట్ల రేవంత్ రెడ్డి చూపుతున్న గురు భక్తికి ఇది నిదర్శనం కాదా..? అని నిలదీశారు. జిడబ్లూడిటి అవార్డు ప్రకారం, సిడబ్లూసి అనుమతి పొందకుండా ఈఏసీ అనుమతి ఇవ్వదు అని తెలిపారు. ఎపి అనుమతుల కోసం సిడబ్లూసికి వెళ్లే కంటే ముందే అపెక్స్ కౌన్సిల్ కు వెళ్లాలనే సోయి కూడా లేదు రేవంత్ కు లేదని విమర్శించారు. కనీస అవగాహన లేని వ్యక్తులు నీటి పారుదల శాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉండటం రాష్ట్రానికి పట్టిన దౌర్భాగ్యం అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రస్తావనే రాని బనకచర్ల ప్రాజెక్టు, ఇప్పుడు ఎవరి అండ చూసుకొని ముందుకు వచ్చిందో తెలంగాణ ప్రజలకు తెలియదా..? అని ప్రశ్నించారు. రేవంత్ మౌనంగా ఉంటూ అందిస్తున్న సహకారం వల్లనే కదా బనకచర్ల వ్యవహారం ఇక్కడి దాకా వచ్చింది అని నిలదీశారు. తెలంగాణ నీటి హక్కుల విషయంలో అన్యాయం చేస్తూనే, లెక్కకు మించి అబద్ధాలు ప్రచారం చేస్తూ.. బీఆర్ఎస్ పై చేస్తున్న రేవంత్ రెడ్డి క్షుద్ర రాజకీయాన్ని తెలంగాణ సమాజం గమనిస్తున్నదని, ఆయన తెలంగాణ వ్యతిరేక విధానాలను అసహ్యించుకుంటున్నదని పేర్కొన్నారు.

## కాళేశ్వరం .. కమీషన్ల కోసమే

**మొదటి పేజీ తరువాయి**
ఉమ్మడి జిల్లాల కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని నాశనం చేసిందని దుయ్యబట్టారు. 2014లో తెలంగాణ నూతన రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ పార్టీ నిధులు, నియామకాలు అని చెప్పి నిధులన్నింటినీ కేసీఆర్ కుటుంబసభ్యులు నీళ్లన్నీ ఫాంహౌస్ లోకి తరలించారని ఆరోపించారు. వరి వేస్తే రైతులకు ఉరి పడ్డట్టేనని అన్నారని, కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం పండిరచిన రైతులకు రూ 500 బోనస్ ఇస్తుందని ప్రశంసించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోని పేద ప్రజలకు ఉచితంగా సన్న బియ్యం అందిస్తుందని, అలాగే 200 యూనిట్ల వరకు ఉచితంగా ఇళ్లకు కరెంట్ ఇస్తోందని కొనియాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేవలం పదేళ్లలో కేవలం 60 వేల ఇళ్లు మాత్రమే మంజూరు చేసిందని, అందులో సగానికి పైగా బిల్లులు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ ప్రజల్లోకి వెళ్లే విధంగా ప్రతికార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఈ నెల 4 వ తేదిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నూతన పీసీసీ నియామకం తర్వాత మొదటి సారిగా రాష్ట్రానికి వస్తున్నారని తెలిపారు. అందుకు ప్రతి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు రావాలని పిలుపు ఇచ్చారు. ఆ రోజు ప్రతి కాంగ్రెస్ నాయకులకు, పార్టీ దిశ నిర్దేశం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, కార్పొరేషన్ ఛైర్మన్లు సురేశ్ షెట్కార్, సుదర్శన్ రెడ్డి, జీవన్ రెడ్డి, భూపతిరెడ్డి, ఈరవత్రి అనిల్, మదన్ మోహన్, లక్ష్మీ కాంతారావు, సంజయ్, బల్మూరి వెంకట్, వీరం బొజ్జ, బండి రవి తదితరులు పాల్గొన్నారు.

# ఆవిష్కరణలకు ప్రోత్సాహం

* **కేబినెట్ కీలక నిర్ణయాలు వెల్లడిరచిన మంత్రి అశ్వినీ వైష్ణవ్**

**న్యూఢిల్లీ,జులై 1 :**
పరిశోధనాభివృద్ధి, ఆవిష్కరణల రంగంలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా పరిశోధన అభివృద్ధి ఆవిష్కరణ పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ స్కీమ్కు రూ.లక్ష కోట్లు కేటాయింపునకు పచ్చజెండా ఊపింది. ఆర్డీఐలో ప్రైవేటు రంగ పెట్టుబడులను ప్రోత్సహించేందుకు తక్కువ వడ్డీ రేటు లేదా వడ్డీరహిత దీర్ఘకాలిక ఫైనాన్సింగ్ లేదా రీఫైనాన్సింగ్ అందించడమే ఈ పథకం లక్ష్యమని కేంద్రం పేర్కొంది. ప్రైవేట్ రంగం నిధుల విషయంలో ఎదుర్కొనే అడ్డంకులు, సవాళ్లను అధిగమించేందుకు దీన్ని డిజైన్ చేసినట్లు తెలిపింది. ప్రధానమంత్రి అధ్యక్షతన ఉన్న అనుసంధాన్ జాతీయ పరిశోధనా ఫౌండేషన్ పాలక మండలి.. ఆర్డీఐ పథకానికి దిశానిర్దేశర చేస్తుందని పేర్కొంది. కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలను కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. కేంద్ర క్యాబినెట్ మంగళవారంనాడు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.



**రూ.3 లక్షల కోట్ల పథకాలకు ఆమోదం**

రూ.3 లక్షల కోట్లకు పైగా విలువచేసే పలు కీలక పథకాలకు ఆమోదం తెలిపింది. వీటిలో ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ ), పరిశోదనఅభివృద్ధిఆవిష్కరణ , జాతీయ క్రీడావిధానం 2025, తమిళనాడులో కీలక మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టు ఉన్నాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పరిశోధానాభివృద్ధి, ఆవిష్కరణ రంగంలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా రీసెర్చ్ డవలప్మెంట్ అండ్ ఇన్నొవేషన్ పథకానికి కేంద్ర క్యాబినెట్ గ్రీన్సిగ్నల్ ఇచ్చింది. దీనికి రూ.1 లక్ష కోట్లు కేటాయించింది. ఇజ్రాయెల్, యూఎస్, సింగపూర్, జర్మనీ వంటి దేశాల్లో విజయవంతమైన గ్లోబల్ మోడల్స్ను అధ్యయనం చేసి అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ రూపొందించిన అంతర్జాతీయ రోడ్మ్యాప్ ఆధారంగా ఈ స్కీమ్ ఉంటుంది. ప్రైవేటు రంగం నిధుల విషయంలో ఎదుర్కొనే సవాళ్లను అధిగమించేందుకు దీన్ని డిజైన్ చేసినట్టు తెలిపింది. ఈ పథకం కింద ఆర్డీఐలో ప్రైవేటు రంగ పెట్టుబడులను ప్రోత్సహించేందుకు తక్కువ వడ్డీ, వడ్డీరహిత దీర్ఘకాలిక ఫైనాన్సింగ్ అందించనున్నారు. మాన్యుఫాక్చరింగ్ రంగంలో ఉపాధి ఆధారిత ప్రోత్సాహకాల పథకానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రూ.1.07 లక్షల కోట్లతో ఈ పథకాన్ని అమలు చేస్తారు. ఇది మ్యాన్యుఫ్యాక్చరింగ్డ్రైవెన్ ఎకానమికి కీలక గ్రోత్ ఇంజన్ అని గత బడ్జెట్లో వైష్ణవ్ ప్రకటించారు. దేశంలో క్రీడా మౌలిక సదుపాయాలు పెంచడం, క్రీడాకారుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా జాతీయ క్రీడా విధానం 2025కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

**ఉపాధి ఆధారిత ప్రోత్సాహకాల పథకానికి పచ్చజెండా**

ఉపాధి ఆధారిత ప్రోత్సాహకాల పథకానికి కేబినెట్ పచ్చజెండా ఊపింది. తద్వారా తయారీ రంగంలో ఉపాధి కల్పించే పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వనుంది. రెండేళ్ల కాలపరిమితిపై రూ.99,446 కోట్లతో ఉపాధి ఆధారిత ప్రోత్సాహక (ఇఎల్ఐ) పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే, తమిళనాడులోని పరమకుడిరామనాథపురం హైవే నాలుగు లేన్ల విస్తరణకు ఆమోదం తెలిపిన క్యాబినెట్.. ఈ ప్రాజెక్టు కింద 46.7 కి.మీల పొడవైన రహదారి నిర్మాణానికి రూ.1853 కోట్ల వ్యయం చేయనుంది. గత దశబ్దా కాలంలో భారతదేశం క్రీడారంగంలో సాధిస్తున్న వృద్ధిని దృష్టిలో ఉంచుకుని జాతీయ క్రీడా విధానం2025కు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రతిభావంతులైన క్రీడాకారులను అట్టడుగు స్థాయి నుంచి ఉన్నత స్థాయికి తీసుకు వెళ్లడం, కోచింగ్ అవకాశాలు పెరుగుపరచడం, దేశంలోని క్రీడా సదుపాయాలను పటిష్టం చేయడం వంటికి ఈ పథకం ప్రధాన ఉద్దేశాలు. దక్షిణ భారతదేశంలో మౌలిక వసతులను మరింత మెరుగుపరచడంలో భాగంగా తమిళనాడులోని పరమకుడిరామనాథపురం సెక్షన్ల మధ్య నాలుగు లేన్ల నేషనల్ హైవే విస్తరణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 46.7 కిలోమీటర్ల పొడవైన ఈ రహదారి నిర్మాణానికి రూ.1,853 కోట్లు ఖర్చు పెట్టనున్నది.

## రైల్ వన్ యాప్ వచ్చిందోచ్

**న్యూ ఢిల్లీ, జూలై 1 :**
రైలు ప్రయాణీకులకు శుభవార్త. ఇక రైలు సేవలన్నీ ఒకే చోట పొందవచ్చు. సిఆర్ఐఎస్ 40వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల సందర్భంగా రైల్వే మంత్రిత్వ శాఖ 'రైల్ వన్' యాప్ ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ను మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ యాప్ ఆండ్రాయిడ్ ప్లే స్టోర్, ఐఓఎస్ యాప్ స్టోర్ రెండింటిలోనూ అందుబాటులో ఉంది. రైల్ వన్ యాప్ అనేది ప్రయాణీకుల అన్ని ముఖ్యమైన సేవలకు ఒకస్టాప్ వంటిది. ఈ యాప్ ద్వారా ప్రయాణీకులు టిక్కెట్లు కొనడం, రిజర్వుడు, అన్ రిజర్వుడు టిక్కెట్లు, రైలు, పిఎన్ఆర్ ఎంక్వైరీ, రైలు సహాయ సేవలు, రైలులో భోజనం బుకింగ్, సరుకు రవాణా సంబంధిత విచారణలు కూడా అందుబాటులో ఉన్నాయి.

## అమ్రాబాద్ టైగర్ ఫారెస్ట్ మూసివేత

* **జంతువుల సంతానోత్పత్తి కోసం చర్యలు**
* **అటవీ శాఖ వన్యప్రాణి విభాగం ప్రకటన**

**నాగర్కర్నూలు, జూలై 1:**
పెద్ద పులులు, అరుదైన వన్య ప్రాణుల ఆరోగ్య భద్రతా, సంతానవృద్ధి, సంతానోత్పత్తి ప్రక్రియల దృష్ట్యా అమ్రాబాద్ టైగర్ రిజర్వును మూడు నెలల పాటు రాష్ట్ర అటవీ శాఖ వన్యప్రాణి సంరక్షణ విభాగం మూసివేస్తున్నట్లు ప్రకటించింది. పర్యాటకులను ఆకట్టుకునే అమ్రాబాద్ టైగర్ రిజర్వ్లో సందర్శకుల కోసం జంగిల్ ట్రిప్, వీక్షణ ప్రదేశాల వంటి సందర్శన ప్రాంతాలు జూను 30 వరకు అందుబాటులో ఉన్నాయి. తాజాగా జాతీయ పెద్దపుల సంరక్షణ అథారిటీ (ఎన్టిసిఎ) మార్గదర్శకాలకు అనుగుణంగా పులులతో పాటు ఇతర వన్యప్రాణుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు జూపార్క్ డైరెక్టర్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ , అటవీశాఖ అచ్చంపేట సర్కిల్ కన్జర్వేటర్ డాక్టర్ సునీల్ ఎస్. హిరేమంత్ తెలిపారు.ప్రతి ఏడాది వర్షాలంలో టైగర్ రిజర్వ్లో పెద్దపులు, ఇతర వన్యప్రాణులు వర్షాల కారణంగా తడిసిన నేలల్లో ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తల్లో భాగంగా వాటికి ఇతరాత్ర అలికిడి ఉండని విధంగా సిబ్బందితో పాటు సందర్శకులను కన్జర్వేషన్ జోన్లోకి అనుమతించరు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా జూలై 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు అమ్రాబాద్ టైగర్ రిజర్వ్లోని ఫర్హాబాద్ వ్యూ పాయింట్, అక్టోపస్ వ్యూ పాయింట్లు మూసి వేస్తున్నట్లు ఫీల్డ్ డైరెక్టర్ వెల్లడిరచారు. వన్యప్రాణుల పరిరక్షణ ప్రయత్నాలు సులభతరం చేయడంతో పాటు వ్యాధు వ్యాప్తిని నివారించేందు ఈ మూడు నెలల కాలం ఎంతో కీలకం. దాంతో టైగర్ రిజర్వ్కి పర్యాటకులను అనుమతించరు. పెద్ద పులుల సంతోనోత్పత్తి ఎ లాన్ (టిసిపి) ప్రకారం పర్యావరణ వ్యవస్థ, వన్యప్రాణుల సంరక్షణ నిర్వహించడానికి టైగర్ జోన్ మూసివేత దోహద పడుతుంది. అంశాన్ని పర్యాటకులు, వన్యప్రాణి ఔత్సాహికులు గ్రహించి సహకరించాలని అధికారులు కోరుతున్నారు. పర్యాటకులతోపాటు ఇతరులు ఎవరూ కూడా ఆంక్షలు అమలులో ఉన్న పెద్దపులుల సంరక్షణ ప్రదేశాల వద్ద నిబంధనలు ఉల్లగించి కనిపిస్తే సహించేది లేదని ఫీల్డ్ డైరెక్టర్ హెచ్చరించారు. కాగా, వర్షా కాలంలో వన్యప్రాణులు సంతానోత్పత్తి చేసి పుట్టిన పిల్లను సంరక్షించుకునేందు ప్రశాతం వాతావరణం కోరుకుంటాయి. పలు రకాల వన్యప్రాణులు సంతానోత్పత్తి పక్రియకు ఆడ, మగ జంతువులు జతకట్టె అనుకూల కాలం కూడా ఈ మూడు నెలలలో అధికంగా ఉంటుంది. వేసవి కారణంగా ఎండిన అటవీ ప్రాంతం వర్షాలు కురుస్తుండడంతో తిరిగి సమతుల్యతను పెంచుకునే వీలు ఉంటుంది.

## సిగాచి ఓనర్ పై సీఎం ఫైర్



**సంగారెడ్డి, జూలై1 :**
పాశ మైలారం సిగాచి ఫ్యాక్టరీ యాజమాన్యంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత పెద్ద ప్రమాదం జరిగి ఇంతమంది కార్మికులు చనిపోయినా అడ్రస్ లేకుండా పోయారని మండిపడ్డారు. సరైన రక్షణ చర్యలు లేకుండా పనులు చేయడం వల్లే ప్రమాదం జరిగినట్టు తెలుస్తున్నదని చెప్పారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సంగారెడ్డి జిల్లా పఠాన్ చెరు మండలం పాశమైలారంలో పేలుడు ప్రమాద మృతుల కుటుంబాలకు తక్షణ సాయంగా రూ.లక్ష చొప్పున ఇస్తున్నట్టు ప్రకటించారు. త్వరలో కోటి రూపాయల పరిహారం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. తీవ్రంగా గాయపడి ఎలాంటి పని చేసుకోలేని స్థితిలో ఉన్న బాధిత కుటుంబాలకు రూ.10 లక్షలు, స్వల్పంగా గాయపడి, తిరిగి పనిచేసుకోగలిగే వారికి రూ.5 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. చనిపోయిన వారి పిల్లల చదువుల బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని, గురుకులాలో సీట్ల గురించి మాట్లాడాలని అధికారులకు సూచించామని చెప్పారు. బాధితులకు ప్రభుత్వం తరపున వైద్యం అందించే బాధ్యత తీసుకుంటామని తెలిపారు. సిగాచి ఫ్యాక్టరీ ప్రమాదాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కంపెనీ యాజమాన్యం, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంగళవారం మంత్రులు, అధికారులతో కలిసి ప్రమాద స్థలాన్ని పరిశీలించిన సీఎం రేవంత్.. ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణలో ఇన్ని ప్రాణాలను బలిగొన్న ప్రమాదం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఫైర్, హైడ్రా, డిజాస్టర్, రెవెన్యూ శాఖల సమన్వయంతో సహాయక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ ఘటనలో ఎలాంటి సహాయక చర్యలు తీసుకోవాలో ఆదేశించడం జరిగిందని చెప్పారు. ఘటనలపై కమిటీ రిపోర్ట్ ఇస్తుందని.. ప్రాథమిక సమాచారం తర్వాత ప్రమాదపై పూర్తి వివరాలు చెబుతామని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని హామీ ఇస్తున్నట్లు చెప్పారు. ఇలాంటి ఘటనలను భవిష్యత్ లో జరగకుండా ఉండేందుకు.. ఓ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సీఎం రేవంత్ చెప్పారు.

# బతుకులు బుగ్గి!

**మొదటి పేజీ తరువాయి**
తెలిపారు. కాగా తమవాళ్ల జాడ కోసం బాధిత కుటుంబ సభ్యులు గుండెలు అవిసేలా రోదిస్తున్నారు. తమవాళ్ల ఆచూకీ వెతికి పెట్టాలని కనిపించిన వారినల్లా వేడుకుంటున్నారు.
సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి ఫ్యాక్టరీలో జరిగిన పేలుడు అతిపెద్ద ప్రమాదమని తెలుస్తున్నది. భవనాల శిథిలాల కింద కార్మికులు, సిబ్బంది మృతదేహాలు చిక్కుకొని పోయాయి. మృతుల్లో ఎక్కువమంది బీహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల వారు ఉన్నారు. ఏపీ, తెలంగాణకు చెందిన ఆరుగురు చనిపోయినట్టు సమాచారం. సోమవారం మొదటి షిఫ్టుకు 130కి పైగా కార్మికులు, సిబ్బంది విధుల్లో ఉన్నారు. భారీ పేలుడుతో చాలా మంది మంటల్లో పడి, భవనాల కింద పడి చనిపోయారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. 51 మంది చనిపోయినట్టు తెలియగా ఇంకా ఎంతమంది చనిపోయారో తెలియని పరిస్థితి ఉన్నది. పటాన్చెరు హాస్పిటల్లో బాధితులను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పరామర్శించారు.

***మృతదేహాల అప్పగింత**

ఇప్పటివరకు పోలిశెట్టి ప్రసన్న(తూర్పుగోదావరి), బోరిగుట్ట హేమచందర్ (చిత్తూరు), శ్రీరమ్య (కడప), వీ నాగేశ్వర్రావు (మంచిర్యాల), నిఖిల్కుమార్(కడప), దాసరి సునీల్ కుమార్ (ప్రకాశం), నాగజిత్ తివారి (ఒడిశా), శశిభూషణ్ (బీహార్), జగన్మోహన్ (ఒడిశా), రాంసింగ్ (ఉత్తర ప్రదేశ్), రుక్సానా ఖాతూన్ (బీహార్), నిఖిల్ (కడప), మనోజ్ (యూపీ), డోలా గోవింద్ సాహు (ఒడిశా), రాజ్ కుమార్ (బీహార్) మృతదేహాలను కుటుంబీకులకు అందించారు. మృతదేహాలు పూర్తిగా కాలిపోవడంతో వాటి గుర్తింపు ఇబ్బందిగా మారింది. డీఎన్ఏ టెస్ట్ ద్వారా గుర్తించేందుకు 20కి పైగా మృతదేహాల శాంపిల్స్ సేకరించారు. పాశమైలారం ఫ్యాక్టరీలో ప్రమాదం జరిగినప్పటి నుంచి యాజమాన్యం పత్తా లేకుండా పోయింది. పెద్ద సంఖ్యలో కార్మికులు చనిపోయినా యజమానులు జాడ లేకపోవడంతో తోటి కార్మికులు, కుటుంబీకులు దుమ్మెత్తి పోస్తున్నారు.

# సల్లవడ్డ ఉడుకు రక్తం!

**మొదటి పేజీ తరువాయి**
అర్వింద్,రాజాసింగ్ వర్గాలు గుర్రుగా ఉన్నాయా? అంటే 'అవును' అనే అంటున్నాయి తాజా పరిణామాలు. మరోవైపు బీజేపీలో ఎదుగుతున్న ఈటలకు చెక్ పెట్టేందుకే రామచందర్రావును పథకం ప్రకారం తెరమీదికి తెచ్చారన్న ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి.

***అలలా ఎగిసి..**

తెలంగాణ ఉద్యమానికి బీజేపీ మద్దతు ఇవ్వడం, ఆ తర్వాత పార్లమెంట్లో బిల్లు పాస్ కావడానికి తోడ్పాటును అందించడం, అనంతరం కేంద్రంలో ఆ పార్టీ అధికారంలోకి రావడంతో మెల్లమెల్లగా తెలంగాణలోనూ బీజేపీకి సానుకూల పవనాలు వీచాయి. కార్పొరేటర్ స్థాయి నుంచి అంచెలు అంచెలుగా కరీంనగర్లో బీజేపీని బలోపేతం చేసుకుంటూ వచ్చిన ప్రస్తుత కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కి రాష్ట్ర పార్టీ పగ్గాలు అందించిన తర్వాత తెలంగాణలో కమలం పార్టీ మరింత పుంజుకున్నది. నాటి అధికార పార్టీ బీఆర్ఎస్ పై బండి సంజయ్ దూకుడుగా విమర్శనాస్త్రాలు సంధించడం, ఆ పార్టీ నేతలపై పదునైన ఆరోపణలు చేస్తూఅందరూ ఆయన వైపు తిరిగి చూసేలా చేశారు. అంతే కాకుండా కరీంనగర్ ఉమ్మడి జిల్లా అంతటా కలియ దిరుగుతూ యువతను ఆకర్షించారు. హిందూత్వ భావజాలానికి మరింత పదును పెడుతూ హిందూబంధువులందరికీ చేరువయ్యారు. ఆయన తెలంగాణ అంతటా తిరిగి బీజేపీ బలోపేతం కోసం కృషి చేశారు. ఏకంగా బీఆర్ఎస్ అధినాయకత్వాన్ని టార్గెట్ చేసి గులాబీ సర్కారు చేపట్టిన పలు కార్యక్రమాలు, అభివృద్ధి పనుల్లో అవినీతి జరిగిందని నిలదీశారు. ఒకానొక దశలో 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ తర్వాత బీజేపీ అన్నంతగా పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లారు.

***ఎన్నికల ముందు అనూహ్యం**

అనూహ్యంగా ఎన్నికల ముందు బండి సంజయ్ని అధ్యక్ష బాధ్యతల నుంచి పార్టీ అధిష్ఠానం తప్పించి కిషన్రెడ్డికి పదవి అప్పగించింది. అప్పటి నుంచే తెలంగాణలో బీజేపీకి కాస్తబలం తగ్గినట్టు అయింది. తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, గత టీడీపీ మనిషి రేవంత్ సీఎం కావడం, బీజేపీ పొత్తుతో ఆంధ్రలో టీడీపీ అధికారం చేపట్టడంతో తెలంగాణలోనూ కాంగ్రెస్కు బీజేపీ సపోర్ట్ చేస్తూ వస్తున్నదన్న విమర్శలు బీఆర్ఎస్ నుంచి వచ్చాయి. బీజేపీ కూడా తెలంగాణలో అధికారంలో ఉన్న పార్టీని కాకుండా గత బీఆర్ఎస్నే టార్గెట్ చేస్తూ విమర్శలు చేయడం గులాబీ నేతల ఆరోపణలకు మరింత బలాన్నిచ్చింది. కేంద్రంలో అయితే బీజేపీ, లేదంటే కాంగ్రెస్ మాత్రమే అధికారంలో ఉండాలని, రెండు జాతీయ పార్టీలు కలిసి ఆయా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను అణగదొక్కుకుంటూ వస్తున్నాయని బీఆర్ఎస్ ఆరోపణలు చేస్తూ వస్తున్నది.

***శ్రేణులకు షాక్**

తాజాగా బీజేపీ తెలంగాణ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ రామచందర్రావును పార్టీ అధిష్ఠానం ఎంపిక చేసింది. దీంతో ఇన్ని రోజులూ తమకే పదవి దక్కుతుందని ఆశించిన ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యేలు రఘునందన్రావు, రాజాసింగ్, వారి వారి అనుచరులు, కార్యకర్తలకు షాక్ తగిలినట్టయింది. ఈ సారి ఈటలకే పార్టీ పగ్గాలు అప్పజెప్తారని, తద్వారా మరింత దూకుడుగా వెళ్లి తెలంగాణలో అధికారంలోకి వస్తామని పార్టీ శ్రేణులు భావించాయి. ఒకానొక దశలో ఈ నలుగురిలో ఎవరికి ఇఆయన ఈ తరం వారికి ఎవరికీ తెలియదని, పైగా గట్టిగా మాట్లాడలేరని, కౌంటర్లు ఇచ్చే పరిస్థితి లేదని కమలం ముఖ్యనేతలు వాపోతున్నారు. ఇటు సోషల్ మీడియాలోనూ బీజేపీ కార్యకర్తలే ఇక తాము 'తెలంగాణలో అధికారంలోకి వచ్చినట్టే' నంటూ నైరాశ్యంతో కామెంట్లు పెట్టడం హాట్ టాపిక్గా మారింది.

***ఇరు పార్టీల విమర్శలు**

మరోవైపు రామచందర్రావు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్కు దగ్గరని, అందుకే కేసీఆర్ డైరెక్షన్లో బీజేపీ అధిష్ఠానం నిర్ణయం తీసుకున్నదని, వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలు పొత్తు పెట్టుకుంటాయని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తున్నది. ఇంకోవైపు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్కు మరోసారి తెలంగాణలో అవకాశం ఇచ్చేందుకే బీజేపీ ఈ నిర్ణయం తీసుకున్నదని, ఇది రేవంత్, బీజేపీ మధ్య లోపాయికారి ఒప్పందని బీఆర్ఎస్ విమర్శిస్తున్నది. కాగా బీజేపీ అధ్యక్ష పదవి కోసం కనీసం నామినేషన్ కూడా వేసే అవకాశం ఇవ్వలేదని అలిగిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఏకంగా పార్టీకి రాజీనామా చేశారు.

***ఈటలకు చెక్ పెట్టేందుకేనా?**

బీఆర్ఎస్ను వీడి బీజేపీలో చేరినప్పటినుంచి ఈటల పార్టీలో మరో పిల్లర్గా మారారు. కొన్ని రోజులుగా పార్టీ అధిష్ఠానం ఆయనకే తెలంగాణ బాధ్యతలు అప్పగిస్తుందన్న వార్తలు కూడా వచ్చాయి. ఈ క్రమంలో ముందునుంచీ ఉన్న తమకు ప్రాధాన్యం తగ్గుతుందని, వెనకొచ్చిన వారికి ప్రాధన్యత పెరుగుతుందని భావించిన కొందరు పార్టీ ముఖ్యులు ఈటలకు చెక్ పెట్టేందుకే రామ్చందర్రావును అనూహ్యంగా తెరపైకి తెచ్చారని తెలుస్తున్నది. రామ్చందర్రావు మొదటి నుంచీ బీజేపీలోనే ఉంటూ పార్టీకి విధేయుడిగా ఉంటూ వస్తున్నాడని, సౌమ్యుడిగా పేరు తెచ్చుకున్నాడని, ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చినవాడని అందుకే పార్టీ ఆయనకు అవకాశం కల్పించిందన్న చర్చలు కూడా నడుస్తున్నాయి.

# చెరువులకు మహర్దశ

- శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 64 చెరువులను సుందర శోభిత వనంలుగా తీర్చిదిద్దుతాం
- మల్లిగవాడ్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం
- మన భవిష్యత్తు తరాలకు ఆస్తులు కాదు మంచి ఆరోగ్యం, ప్రశాంత జీవితం ఇవ్వాల్సిన బాధ్యత మనందరి పైన ఉంది
- పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ



**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో :**

మియపూర్ డివిజన్ పరిధిలోని లక్ష్మీ నగర్ కాలనీలో గల నాయనమ్మ కుంట చెరువు సుందరీకరణలో భాగంగా నెక్సస్ సెలెక్ట్ మాల్స్ కంపెనీ, ఐజీయూఎస్, హెచ్ డీఎఫ్‌సీ బ్యాంక్ ల వారి సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా చేపట్టనున్న చెరువుల పునర్జీవనంలో భాగంగా సుందరీకరణ, పునరుద్ధరణ పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, ఇరిగేషన్ అధికారులతో కలిసి పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజకవర్గం లో ని 64 చెరువులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, చెరువుల సుందరికరణ తో స్వచ్ఛమైన వర్షపు జల సిరులను ఒడిసిపడుద్దా మని, చెరువుల జలకళ తో గ్రామీణ వాతావరణం నెలకొల్పడమే నా ధ్యేయంగా పనిచేస్తానని, చెరువులను కాపాడితే అవి మనల్ని కాపాడుతాయి , జీవ వైవిధ్యం పెరుగుతుంది,పక్షులు వలసలు మొదలు అవుతాయి అని, చెరువుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని , చెరువులను దత్తత తీసుకొని అభివృద్ధి చేసే వారు కనబడే దేవుళ్ళతో సమానమని తెలియచేశారు.

మియపూర్ లో అన్ని చెరువులకు సుందరికరణ భాగ్యము కలిగినది . త్వరలోనే మియపూర్ రూపురేఖలు మారునని దశ దిశ మారినది అని ఇక్కడి పరిసర ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన ఆహ్లాదకరమైన వాతావరణం అందించడమే నా లక్ష్యం అని తెలియచేశారు. , చెరువు పునరుద్ధరణ ప్రభుత్వం, పరిశ్రమలు మరియు సమాజం మధ్య భాగస్వామ్య ప్రయత్నాలు అర్థవంతమైన పర్యావరణ పురోగతిని ఎలా నడిపించగలదో చెప్పడానికి ఒక శక్తివంతమైన ఉదాహరణగా నిలుస్తుంది. ఈ ప్రాజెక్ట్ కీలకమైన సహజ వనరులను పునరుజ్జీవింపజేయడమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా భవిష్యత్తులో సుస్థిరమైన అభివృద్ధి కోసం ఒక నమూనాను ఏర్పాటు చేస్తుంది'' అని అన్నారు. మియపూర్ లోని చెరువులకు కు నేటి తో దశ దిశ మారినది అని, ఎన్నో ఏండ్ల సమస్య నేటి తో తిరునని, శాశ్వత పరిష్కారం దిశగా చెరువులను అభివృద్ధి చేపట్టడం జరిగినది అని, మురికి కూపంలాంటి చెరువులకు స్వచ్ఛమైన మంచి నీరు లాంటి చేరువుల్లుగా తీర్చిదిద్దాడమే ధ్యేయం గా పని చేసి నిరూపించడం జరుగుతుంది అని ,చెరువుల పునర్జీవనం తరువాత సుజల జలం తో అపురూప దృశ్యకావ్యం గా ఆవిష్కృతమైతది అనడంలో ఎటువంటి సందేహం లేదు అని , చెరువు కట్ట చుట్టూ చెట్లు పెంచి చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని తెలియచేసారు. మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుందరికరణ చేపట్టుటకు ముందుకు రావడం చాలా అభినదించదగ్గ విషయం అని, సమాజ హితం , సమాజ సేవ చేయడం కోసం ముందుకు రావడం చాలా గర్వించదగ్గ విషయ అని, సాఫ్ట్ వేర్ సంస్థ ప్రతినిధులను ప్రత్యేకంగా అభినదిస్తున్నాను అని పేర్కొన్నారు. చెరువు సుందరికరణ, సంరక్షణ, అభివృద్ధి పనులు త్వరితగతిన చేపట్టడం జరుగుతుంది అని,త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకువస్తామని తెలియచేసారు. అదేవిధంగా చెరువు సుందరికరణ లో భాగంగా చెరువు కట్ట పటిష్టం పరిచేలా పునరుద్ధరణ , మురుగు నీరు చెరువు లో కలవకుండా ప్రత్యేకంగా చెరువు చుట్టూ నిర్మించే మురుగు నీటి కాల్వ నిర్మాణం మరియు అలుగు మరమ్మత్తులు, చెరువు కట్ట బలోపేతం , పునరుద్దరణ పనులు, వాకింగ్ ట్రాక్ వంటి పనులు చేపడుతామని తెలియచేసారు. నాయనమ్మ కుంట చెరువు సంరక్షణ లో భాగంగా చెరువు చుట్టూ ఫెన్సిగ్ (కంచె) నిర్మాణం మరియు చెరువు యొక్క అలుగు నిర్మాణము మరియు చెరువు సుందరికరణ పనులు చేపడుతున్నాం అని , నాయనమ్మ కుంట చెరువు సుందరికరణ మరియు అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని అధికారులకు తెలియచేశారు అదేవిధంగా ప్రణాళిక తో పనులు చేపట్టాలని తెలియచేసారు . అదేవిధంగా చెరువులను సంరక్షణిచడమే ధ్యేయంగా పనిచేస్తున్నాం అని తెలియచేసారు. అదేవిధంగా చెరువును సుందరవనం గా , శోభితవర్ణం గా తీర్చిద్దుతామని, అదేవిదంగా చెరువు ల చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి చెరువు ల ను సంరక్షిస్తామని అన్నారు .చెరువు ల వాకింగ్ ట్రాక్ నిర్మాణం గూర్చి అధికారులకు పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగినది . త్వరిత గతిన వాకింగ్ ట్రాక్ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనీ తెలియచేశారు .

ప్రజలకు చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తామని, అలాగే నియోజకవర్గం లోని అన్ని చెరువులను పూర్తి స్థాయిలో సుందరీకరిస్తామని చెప్పటం జరిగినది చెరువుల పరిరక్షణకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని చెప్పడం జరిగింది .

చెరువు చుట్టుపక్కల కాలనీ వాసులు మరియు ప్రజలు చెరువును సంరక్షించడంలో ప్రతి ఒక్కరు బాధ్యత యుతంగా సామాజిక బాధ్యతో సంరక్షించుకోవలని, చెరువుల పరిరక్షణ లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలియచేసారు.

ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు డీఈ నళిని, ఏఈ పావని ఐటీ సంస్థ ప్రతినిధులు రామ్ బొట్ట, , కాలనీల అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మనసా దేవి ఆలయంలో అమ్మవారికి తులం బంగారం బహుకరణ

**జర్నలిస్ట్ డైరీ (జూలై 1)**

గన్నేరువరం మండల పరిధిలోని కాసింపేట గ్రామం లోని మానసా దేవి ఆలయంలో చొక్కారావుపల్లి గ్రామానికి చెందిన అడిగా రఘురాం రెడ్డి తిరుమల దంపతులు మంగళవారం మానసా దేవి ఆలయంలో మంగళవారం తులం బంగారం మానస దేవి అమ్మవారికి ముక్కు బడిగా ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, బద్దం తిరుపతిరెడ్డి, గోపాల్ రెడ్డి, బుర్ర ఎల్లయ్య దుర్గయ్య లచ్చయ్య రామ్ రెడ్డి, మల్లారెడ్డి. కుటుంబ సభ్యులు పాల్గొన్నారు




## లయన్స్ క్లబ్ ఆఫ్ గన్నేరువరం ఆధ్వర్యంలో

- ఉచిత కంటి వైద్య శిబిరం

**జర్నలిస్ట్ డైరీ, గన్నేరువరం :**

గన్నేరువరం మండల కేంద్రంలో మంగళవారం కంటి వైద్య శిబిరం వచ్చిన పేషంట్లను కంటి పరీక్షలు చేసి చేసి ఆపరేషన్ అవసరం ఉన్నవారిని రేకుర్తి లోని ఆసుపత్రికి ఉచిత బస్సులో తీసుకెళ్లడం జరిగినది వారికి ఈరోజు పరీక్షలు చేసి బుధవారం రోజున ఆపరేషన్ చేసి మళ్లీ గురువారం రోజున గన్నేరువరానికి తిరిగి అదే ఉచిత బస్సులో తీసుకురావడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకట్ రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొలుపుల మోహన్, బొద్దు సునీల్, గంప వెంకన్న, మాధవరావు, బూర శ్రీనివాస్, తెల్ల భాస్కర్, జీల ఎల్లయ్య, ఆర్ఎంపీ డాక్టర్ శ్రీనివాస్ లు పాల్గొన్నారు.


## ప్రాణం పోసేది బ్రహ్మ అయితే.. ఆ ప్రాణాలు నిలబెట్టేది వైద్యులు..

- జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..
- ప్రముఖ వైద్యులకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన సత్కారం
- హాజరైన షాద్ నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ




**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో :**

దేవుడు జన్మని ఇస్తాడు.. కానీ ఆ జన్మలో ఎదురయ్యే ఏ ప్రమాదం నుంచి అయినా మనిషిని కాపాడి అతనికి పునర్జన్మను ఇచ్చేది ఒక వైద్యులు మాత్రమేనని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలో జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకొని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో జరిగిన డాక్టర్స్ డే కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా ప్రాణం పోయేగల శక్తి ఒక్క వైద్యుడికే ఉందని ఆయన అన్నారు. ప్రాణాలు కాపాడే క్రమంలో ఒకవేళ విఫలమైతే వైద్యుల పట్ల దురుసుగా ప్రవర్తించడం సామాన్యులు మానుకోవాలని, ప్రతి వైద్యుడు ప్రాణం పోయడానికే ప్రయత్నిస్తాడని ఆయన పేర్కొన్నారు. షాద్ నగర్ ఏసీపి ఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వైద్యుల పట్ల తన అపారమైన గౌరవం ఉందని, వారిని నిరంతరం గౌరవిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ విజయ్ కుమార్, వైద్యులు నాగవర్ధన్ రెడ్డి, కార్తీక్, ప్రతాప్ కుమార్, దిలీప్ చంద్ర, దయానంద్, విజయలక్ష్మి, ప్రేమ్ కుమార్, శ్రీనివాస్, రమేష్, బండారి మల్లప్ప, శ్రీనివాస్ రాథోడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పవర్ అలీ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గునూరు విశ్వం, చెంది తిరుపతిరెడ్డి, అగునూరు బస్వం, కృష్ణారెడ్డి, ఇబ్రహీం, రఘునాయక్, మెహమూద్, కృష్ణ, బాలరాజ్ గౌడ్, సుదర్శన్ గౌడ్, సీతారాం, శ్రీశైలం గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, రఘు గౌడ్, శ్రీను నాయక్, ముబారక్ అలీ ఖాన్, లింగారెడ్డిగూడెం అశోక్, సాయి కృష్ణ, ఖదీర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.




## తెలంగాణలో ఏసీబీ దూకుడు.. ఆరు నెలల్లో 126 కేసులు

- తెలంగాణలో దూకుడు పెంచిన ఏసీబీ..
- 6 నెలల్లోనే 126 కేసులు నమోదు..
- 125 మంది ప్రభుత్వ ఉద్యోగులు అరెస్ట్..

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్రంలో ఏసీబీ దూకుడు పెంచింది. అవినీతి అధికారులను కటకటాల పాలు చేసేందుకు ప్రయత్నిస్తుంది. అడ్డదారిలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో లంచాలు తీసుకుని ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న వారే టార్గెట్ గా తనిఖీలు చేసిన అక్రమార్కులను అరెస్ట్ చేస్తున్నారు. తాజాగా, తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ దూకుడు పెంచింది. మారుమూల ప్రాంతాల నుంచి కంప్లైంట్ వస్తే.. అక్కడికి వెళ్లి లంచగొడ్డిలను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని తగిన శిక్షలు విధిస్తున్నారు.

ఇక, జనవరి నుంచి జూన్ వరకు కేవలం 6 నెలల్లో 126 కేసులు నమోదు చేసింది ఏసీబీ. జూన్ నెలలో 31 కేసులు నమోదు కాగా, అందులో 15 ట్రాప్, 2 అక్రమాస్తుల కేసు, 3 క్రిమినల్ దుష్ప్రవర్తన, 4 రెగ్యులర్ కేసులు, 7ఆకస్మిక తనిఖీల కేసులు ఉన్నాయి. ఏసీబీ కేసుల్లో అరెస్ట్ అయిన ఇద్దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో పాటు 25 మంది ప్రభుత్వ ఉద్యోగులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ నిందితులు జ్యుడిషల్ రిమాండ్ కు తరలించారు. ఏసీబీ ట్రాప్ కేసులో 3.43 లక్షల రూపాయల డబ్బు సీజ్ చేయగా.. రెండు అక్రమ ఆస్తుల కేసులో 13.50 లక్షల ఆస్తులు, 5.22 లక్షల ఆస్తులు స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఆర్టీఏ, సబ్ రిజిస్టర్ తనిఖీల్లో లెక్క చూపని రూ. 2.72 లక్షలు సీజ్ చేశారు ఏసీబీ అధికారులు. 6 నెలల్లో 80 ట్రాప్ కేసులు, 8 అక్రమాస్తుల కేసులు, 14 క్రిమినల్ దుష్ప్రవర్తన, 10 రెగ్యులర్ ఎంక్వైరీలు, 11 ఆకస్మిక తనిఖీలు ఉన్నాయి. ఇందులో 8 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో సహా 125 మంది ప్రభుత్వ ఉద్యోగులను ట్రాప్ చేసి అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ఈ ట్రాప్ కేసుల్లో 24.57 లక్షల మొత్తం స్వాధీనం చేసుకోగా.. డీఏ కేసులలో 27.66 లక్షల విలువైన ఆస్తులను వెలికి తీశారు.. ఆర్టీఏలో జరుగుతున్న అక్రమలపై ఏసీబీ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది.




## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బీజేపీ నాయకులు

**జర్నలిస్ట్ డైరీ, బెజ్జంకి**


బెజ్జంకి మండలంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మానాల రవి మాతృమూర్తి అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.వీరితో బీజేపీ బెజ్జంకి మండల అధ్యక్షులు కొలిపాక రాజు,మండల నాయకులు బుర్ర మల్లేశం గౌడ్,తూముల రమేష్,దారం సత్తిరెడ్డి,ఒగ్గు కనకయ్య తదితరులు కలరు.

# కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో :**




రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీడీవోలకు, ఎంపీఓలకు, ఏపీఓ ఈజీఎస్ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా క్రింది అజెండా అంశాలు ఎస్ఎస్ జీ స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ 2025, పంచాయతీ అడ్వాన్స్ ఇండెక్స్ 202324, ఎస్.బి.ఎం, సిటిజెన్ సర్వీసెస్, శానిటేషన్, వనమహోత్సవం, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ యావరేజ్ రేట్ అజెండా అంశాలు చర్చించారు. ఈ సందర్భంగా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. వన మహోత్సవంలో భాగంగా ప్రభుత్వ ఆదేశానుసారము పిట్టింగు, ప్లాంటింగ్ తొందరగా పూర్తి చేయాలని, ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వ ఆదేశానుసారం ప్రకారం తొందరగా పూర్తి చేయాలని ప్రతిస్థాయిలో వారి విధులు బాధ్యతలు బాధ్యతగా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డిఆర్డిఓ ఎల్.శ్రీలత, డిపిఓ సురేష్ మోహన్, డిఈఓ సుశీందర్ రావు గారు, డిఎల్పిఓలు , ఎంపీఓలు , ఈజీఎస్ల ఏపీఓలు మరియు పంచాయతీరాజ్ ఈ.ఈ.లు పాల్గొన్నారు.



## హైదరాబాద్ లో భారీ వర్షం..

# స్తంభించిన ట్రాఫిక్

- హైదరాబాద్ నగరంలో భారీ వర్షాలు..
- పలు ప్రాంతాల్లో రోడ్లపై నిల్చిపోయిన నీరు..
- వర్షానికి నగరంలో స్తంభించినపోయిన ట్రాఫిక్..

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

హైదరాబాద్ నగరంలో మరోసారి వర్షం బీభత్సం సృష్టిస్తుంది. నగరంలోని పలు ప్రాంతాల్లో అకస్మాత్తుగా కుండపోత వర్షాలు కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ముఖ్యంగా జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్ నగర్, కూకట్‌పల్లి, ఎల్బీ నగర్, మియాపూర్, అమీర్‌పేట, టోలిచౌకి, బీరంగూడ, పటాన్ చెరువు, బీహెచ్‌ఈఎల్, షేక్ పేట్, మెహిదీపట్నం, లంగర్ హౌస్, కోఠి, గచ్చిబౌలి, అత్తాపూర్ లాంటి ప్రాంతాల్లో వర్షానికి ట్రాఫిక్ తీవ్రంగా స్తంభించిపోయింది.

అయితే, వర్షం కురవడంతో ఐటీ కారిడార్ లోని ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపైకి వరద నీరు వచ్చి చేరడంతో లోతట్టు ప్రాంతాలు మునిగిపోయింది. రోడ్లపైకి నీరు రావడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షానికి వాహనాలు స్లోగా ముందుకు కదలడంతో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడ్డాయి. మరి కొన్ని గంటల్లో తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వర్షం కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే, జీహెచ్ఎంసీ టాస్క్‌ఫోర్స్, డిజాస్టర్ రెస్పాన్స్ టీమ్‌లు రంగంలోకి దిగాయి.

## భూభారతి దరఖాస్తులను గడువులోపు పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి




**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో :**

భూభారతి దరఖాస్తులను గడువులోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరం నుండి భూ భారతి దరఖాస్తుల పరిష్కారం, నజరి నక్షా తయారి, బిఎల్ఓలకు శిక్షణ నిర్వాహణ పై జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి మంగళవారం ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో 1200 ఓటర్ల కంటే ఎక్కువగా ఉంటే అదనపు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని, అదేవిధంగా కొత్త పోలింగ్ స్టేషన్లలకు బీఎల్ఓలను నియమించాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించిన అన్ని శిక్షణా కార్యక్రమాలను ఈ నెల 3వ నుంచి 17వ తేదీ వరకు నిర్వహించాలని, అందుకు మాస్టర్ ట్రైనర్లను నియమించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో పాటు జిల్లాలోని జీహెచ్ఎంసీ పరిధిలో నజరీనక్షాకు సంబంధించి ఆయా పోలింగ్ స్టేషన్ల సరిహద్దుల్లోకి వచ్చే అన్ని కుటుంబాలు, ప్రతి ఇంట్లోని ఓటర్ల సంఖ్య సమగ్ర సర్వే చేపట్టాలని ఆదేశించారు. ఉన్న ఇంటి నెంబరు ఓటరు లిస్టులో ఉన్న ఇంటి నెంబరు సరి చూసుకోవాలి అని అన్నారు. భూ భారతి చట్టం అమలులో భాగంగా ఇప్పటి వరకు జిల్లాలో వచ్చిన 22,096 దరఖాస్తులలో 21, 718 ఆన్లైన్లో నమోదు చేయడం జరిగిందని, మిగిలిన వాటిని కూడా ఆన్లైన్లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తుల నమోదులో సాంకేతిక లోపాలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని అన్నారు. జిల్లాలో వచ్చిన దరఖాస్తులన్నింటిని ఈ నెల 10వ తేదీ వరకు పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత ఆర్డీఓలు, తహసీల్దార్ ను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్ఓ సంగీత, కలెక్టరేట్ సూపరిటెండెంట్లు, ఆర్డీఓలు, తహసీల్దార్ లు తదితరులు పాల్గొన్నారు.

# "దుక్కి" దున్నుతున్న రైతుకు 'దిక్కే' లేదు



భారతదేశ వ్యవసాయ ఆధారిత దేశం అయినా ఇతర రంగాల్లో ఉన్నంత ప్రాధాన్యత వ్యవసాయ రంగానికి కనిపించట్లేదు. వ్యవసాయ రంగంలో అభివృద్ధి కంటే ఎక్కువగా ఆత్మహత్యలే కనిపిస్తున్నాయి. ఈ వాస్తవ పరిస్థితులు చూస్తుంటే బాధేస్తుంది. దేశానికి అన్నం పెట్టే రైతును అక్కున చేర్చుకోవడంలో విఫలమవుతున్నాం.

రాష్ట్రాల విషయానికి వస్తే రెండు తెలుగు రాష్ట్రాల్లో అప్పులు తెచ్చి, నానా అవస్థలు పడి, కష్టపడి పని చేసే రైతన్నలకు గిట్టుబాటు ధర లభించడం లేదు. అప్పులు తీర్చలేక, ఫలితం రాక ఆత్మహత్యలకు పాల్పడాల్సి రావడం ఆధునిక సమాజానికి మాయని మచ్చ. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, పార్టీ నేతలు తాము రైతు పక్షమంటూ కబుర్లు తప్ప కార్యచరణ లేదు. రైతు ఏ ఇతర అంశాల పైన ఆధారపడకుండా తమ కష్టాన్ని మార్గంగా సాగు కోసం పాటు పడుతుంటాడు. అలాంటి రైతుకు ప్రతి ఏటా కష్టాలు కన్నీళ్లే మిగులుతున్నాయి. ఇందులో మళ్లీ సగానికి పైగా కౌలు రైతులు వ్యవసాయం చేసి వ్యవసాయం ఆధార పడాల్సిన పరిస్థితి ఎక్కువైంది. వీరికి పేరుకు తప్ప వాస్తవమైన, నాణ్యమైన భరోసా, సహాయమూ ప్రభుత్వాల నుంచి అందటం లేదు. ఎరువులు అందుబాటులో లేక పండిన పంటలకు గిట్టుబాటు ధర రాక కౌలు రైతులు పడుతున్న ఎదుర్కొంటున్న ఇబ్బందులు వర్ణించలేనిది. సరే ఒక పంట కాకపోతే మరొక పంటతోనైనా ఆదాయం వస్తే చాలు రికవరీ అవుతామని ముందుకు పోతున్న కౌలు రైతుకు ప్రకృతి వైపరీత్యాల దెబ్బలు తప్పటం లేదు. ఇక రైతు పదేపదే కష్టాలు, నష్టాలు ఇబ్బందులు ఎదురవుతుంటే ధైర్యాన్ని కోల్పోయి ప్రాణాలు తీసుకునే పరిస్థితికి దిగజారాల్సి వస్తుంది. రైతు పేరు చెప్పి రాజకీయ లబ్ది పొందడమే తప్పితే రైతు అభివృద్ధికి ఎప్పుడో ఫుల్ స్టాప్ పడిపోయింది. మొన్న నిజామాబాద్ కరీంనగర్ మెదక్ ఏపీలోని పల్నాడు వెస్ట్ గోదావరి విజయనగరం, పలు జిల్లాల్లో పంటలు వేసి నష్టాలు కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరం.

ప్రస్తుత సొసైటీలో వచ్చిన మార్పులతో వ్యవసాయంలో కౌలు రైతుల సంఖ్య కొంచెం పెరిగింది. భూమి సొంతంగా ఉన్న రైతులే నష్టాలను తట్టుకోవటం కష్టం. ఎలాంటి రుణసాయం, ప్రభుత్వ సహాయం అందని కౌలుదారులు ఎకరాకు సుమారు రూ. 20 వేలు కౌలు చెల్లిస్తూ.. సేద్యంలో ఈదుకురావటం కష్టంగా పరిణమిస్తోంది. దీనికి తోడు ప్రకృతి ప్రకోపం, అకస్మాత్తుగా ధరలు పడిపోవటం లాంటి కష్టాలు వెంటాడుతూ ఉంటాయి. రైతుసంఘాల పోరాటాలూ, మేధావుల సూచనలతో చట్టాలు తెచ్చే ప్రయత్నం చేసినా అవి లోపభూయిష్టంగా ఉన్నాయి. భూయజమానుల నుంచి రాతపూర్వక అనుమతి తెచ్చుకోవాలనే నిబంధనతో కౌలుదారులకు గుర్తింపు రావడం లేదు. కాగా కొన్ని రాష్ట్రాల్లో కౌలు రైతులను గుర్తించ ప్రక్రియ బాగానే చేస్తున్నాయి.

కౌలు రైతులకు గుర్తింపు లేని కారణంగా ప్రభుత్వాలు అందించే అరకొర సహాయం కూడా అందకుండాపోతోంది. పంట రుణాలు, భరోసా పథకాలు, నష్ట పరిహారాలు, కౌలు రైతులకు దూరమవుతున్నాయి. వ్యవసాయోత్పత్తులు మార్కెట్టుకు వస్తే వ్యాపారులు ఇష్టారీతిన ధరలు నిర్ణయించి రైతులకు ఇబ్బందులు పెడుతున్నారు. కౌలు రైతుల చట్టాన్ని ప్రయోజనకరంగా, బలంగా చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు నిజమైన దృష్టి పెట్టి అన్నదాతకు అండగా నిలవల్సిన అవసరం ఎంతైనా ఉంది.

{ పట్ట. హరి ప్రసాద్ }
[ 8790843009 ]



## అమెరికా ఒత్తిడికి తలొగ్గని భారత్.. వాణిజ్య ఒప్పందంలో ప్రతిష్టంభన..

- ట్రేడ్ డీల్ కోసం అమెరికా ఒత్తిడి..
- వ్యవసాయం, పాడి పరిశ్రమ విషయంలో రాజీపడని భారత్..
- వాణిజ్య చర్చల్లో ఇరు దేశాల మధ్య ప్రతిష్టంభన..

**జర్నలిస్ట్ డైరీ, జాతీయం:**

ఇండియాఅమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చల్లో ప్రతిష్టంభన నెలకొంది. అమెరికాకు చెందిన నేతలు మాట్లాడుతూ.. భారత్‌తో వాణిజ్య ఒప్పందం తుది దశకు చేరుకుందని చెబుతున్నారు. కానీ, పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ముఖ్యంగా, కొన్ని రంగాల్లోకి అమెరికాను అనుమతించేందుకు భారత్ ఒప్పుకోవడం లేదు. ఇండియాపై ఎంత ఒత్తిడి తెచ్చినా తలొగ్గడం లేదు. దీంతో, పరస్పర సుంకాల అమలులోకి రావడానికి జూలై 09 తుది గడువుగా ఉన్నప్పటికీ, ఆలోపు రెండు దేశాల మధ్య ఒప్పందం కుదరడం కష్టంగానే కనిపిస్తోంది.

ప్రభుత్వ వర్గాల ప్రకారం, భారతదేశంలో 80 మిలియన్ల మంది ప్రజలకు ఉపాధి కల్పిస్తున్న డెయిరీ రంగం విషయంలో భారత్ వెనక్కి తగ్గడానికి నిరాకరించింది. ఈ రంగంలో ఎక్కువగా చిన్న రైతులే ఉన్నారు. డెయిరీ రంగంలో అమెరికా ఒత్తిడిని ఒప్పుకునే ప్రశ్నే లేదని, దీనిని భారత్ ''రెడ్ లైన్''గా భావిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మంగళవారం వాషింగ్టన్‌లో రెండు దేశాల మధ్య చర్చలు ఆరో రోజుకు చేరుకున్నాయి. బుధవారం కూడా చర్చలు జరిగే అవకాశం ఉంది. మరోవైపు, ఎస్ జైశంకర్, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో సమావేశం కానున్నారు. ముఖ్యంగా, భారతదేశం వస్త్రాలు, దుస్తులు, రత్నాలు మరియు ఆభరణాలు, తోలు వస్తువులు, ప్లాస్టిక్‌లు, రసాయనాలు, రొయ్యలు, నూనెగింజలు, ద్రాక్ష,అరటిపండ్లు వంటి విస్తృత శ్రేణి శ్రమఆధారిత రంగాలకు సుంకం రాయితీలను ఆశిస్తోంది. అయితే, ఈ రాయితీలు అమెరికా ప్రయోజనాలను దెబ్బతీయవని మన అధికారులు చెబుతున్నారు. మధ్యంతర వాణిజ్య ఒప్పందం, విస్తృత ద్వైపాక్షిక ఒప్పందానికి మొదటి అడుగుగా భావిస్తున్నారు. ఈ ఒప్పందం భారత్ ఎగుమతులపై 26 శాతం అధిక సుంకాలను తొలగించడం కూడా లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రస్తుతానికి వ్యవసాయంపై భారత్ ఎలాంటి రాజీ పడకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బ తీయకుండా ఉండేందుకు దృఢమైన వైఖరిని అవలంబిస్తోంది. ముఖ్యంగా, వ్యవసాయం, పాడి పరిశ్రమ రంగాల్లో సుంకాల రాయితీలను అమెరికా నుంచి ఆశిస్తోంది. ఈ రంగాల్లోకి అమెరికాను అనుమతిస్తే, భారతీయ రైతుల జీవనోపాధిపై ప్రభావం పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

పారిశ్రామిక ఉత్పత్తులు, ఎలక్ట్రిక్ వాహనాలు, వైన్లు, పెట్రోకెమికల్ వస్తువులు, పాడి మరియు ఆపిల్, చెట్టు గింజలు మరియు జన్యుపరంగా మార్పు చెందిన పంటలు వంటి వ్యవసాయ వస్తువులకు అమెరికా రాయితీ కోరుతున్నట్లు తెలుస్తోంది. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్లకు రెట్టింపు చేయాలనే లక్ష్యంతో ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (BTA) యొక్క మొదటి దశ చర్చలను ఈ సంవత్సరం సెప్టెంబర్అక్టోబర్ నాటికి ముగించాలని భారతదేశం మరియు అమెరికా లక్ష్యంగా పెట్టుకున్నాయి. ప్రస్తుత ద్వైపాక్షిక వాణిజ్యం విలువ 191 బిలియన్ డాలర్లుగా ఉంది.

# అమిత్ షాకు ఇష్టం లేదని: ఇంగ్లీష్ భాష గొప్పతనం తగ్గిపోదు!

ఇంగ్లీష్ భాష ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రభావవంతమైన, విస్తృతంగా మాట్లాడబడే భాషలలో ఒకటి. ఇది కేవలం ఒక భాష కాదు, సాంస్కృతిక, ఆర్థిక, విద్యా, సాంకేతిక రంగాలలో వంతెనగా పనిచేస్తుంది. భారత హోం శాఖ మంత్రి అమిత్ షా గారు ఇంగ్లీష్ మాట్లాడేవారిని అవమానకరంగా వ్యాఖ్యానించారనే సందర్భంలో, ఈ భాష యొక్క గొప్పతనాన్ని సరళంగా, ఉదాహరణలతో వివరిస్తూ ఈ వ్యాసం రాయబడింది.



**ప్రపంచ సమైక్యతకు వంతెన:**
ఇంగ్లీష్ భాష ప్రపంచంలోని వివిధ దేశాలు, సంస్కృతుల మధ్య సంభాషణకు సాధనంగా ఉంది. భారతదేశం వంటి బహుభాషా దేశంలో, హిందీ, తెలుగు, తమిళం వంటి భాషలతో పాటు ఇంగ్లీష్ ఒక సామాన్య భాషగా పనిచేస్తుంది. ఉదాహరణకు, ఒక తెలుగు వ్యక్తి, ఒక బెంగాలీ వ్యక్తితో ఇంగ్లీష్‌లో సులభంగా మాట్లాడగలడు. అంతర్జాతీయ సమావేశాలు, వాణిజ్య ఒప్పందాలు, దౌత్య సంబంధాలలో ఇంగ్లీష్ ఒక కీలక భాషగా ఉంది. ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలలో ఇంగ్లీష్ అధికారిక భాషగా ఉపయోగించబడుతుంది.

**విద్యా, వృత్తి అవకాశాల ద్వారం:**
ఇంగ్లీష్ భాష విద్య, ఉద్యోగ రంగాలలో అపారమైన అవకాశాలను అందిస్తుంది. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి సాంకేతిక కంపెనీలు ఇంగ్లీష్‌ను ప్రధాన భాషగా ఉపయోగిస్తాయి. భారతదేశంలోని ఐఐటీ, ఐఐఎం వంటి సంస్థలలో ఇంగ్లీష్‌లోనే బోధన జరుగుతుంది. ఉదాహరణకు, ఒక గ్రామీణ యువకుడు ఇంగ్లీష్ నేర్చుకొని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా అమెరికాలో ఉద్యోగం సంపాదించవచ్చు. ఇంగ్లీష్ లేకపోతే, అతని అవకాశాలు పరిమితమవుతాయి.

**సాంకేతికత, ఇంటర్నెట్ భాష:**
ఇంగ్లీష్ ఇంటర్నెట్, సాంకేతికత రంగాలలో ఆధిపత్య భాష. వికీపీడియా, యూట్యూబ్, గూగుల్ వంటి ప్లాట్‌ఫారమ్‌లలో అత్యధిక సమాచారం ఇంగ్లీష్‌లో ఉంటుంది. భారతీయ విద్యార్థులు ఇంగ్లీష్ నేర్చుకోవడం వల్ల ఆన్‌లైన్ కోర్సులు, కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాలలో ముందుకు వెళ్తున్నారు. ఉదాహరణకు, పైథాన్, జావా వంటి ప్రోగ్రామింగ్ భాషల డాక్యుమెంటేషన్ ఇంగ్లీష్‌లోనే ఉంటుంది. ఇంగ్లీష్ తెలియకపోతే, ఈ రంగాలలో రాణించడం కష్టం.

**సాహిత్యం, సంస్కృతి వ్యాప్తి:**
ఇంగ్లీష్ భాష ద్వారా ప్రపంచ సాహిత్యం, సినిమాలు, సంగీతం భారతీయులకు అందుబాటులోకి వచ్చాయి. షేక్‌స్పియర్, జేకే రౌలింగ్ వంటి రచయితల రచనలు, హాలీవుడ్ సినిమాలు ఇంగ్లీష్‌లోనే ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందాయి. అదేవిధంగా, భారతీయ రచయితలు అరుంధతీ రాయ్, సల్మాన్ రుష్దీ ఇంగ్లీష్‌లో రాసిన నవలలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. ఇంగ్లీష్ లేకపోతే, ఈ సాంస్కృతిక వినిమయం సాధ్యపడేది కాదు.

**భారతదేశంలో ఇంగ్లీష్ ప్రాముఖ్యత**
భారతదేశంలో ఇంగ్లీష్ ఒక అధికారిక భాషగా, న్యాయవ్యవస్థ, పరిపాలనలో కీలక పాత్ర పోషిస్తుంది. సుప్రీం కోర్టు, పార్లమెంటు చర్చలలో ఇంగ్లీష్ వాడబడుతుంది. ఇంగ్లీష్ మీడియం స్కూళ్లలో చదివిన విద్యార్థులు ఉన్నత విద్య, ఉద్యోగాలలో ముందుకు వెళ్తున్నారు. ఉదాహరణకు, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలలో ఐటీ రంగంలో ఇంగ్లీష్ తప్పనిసరి.

**సామాజిక గౌరవం, ఆత్మవిశ్వాసం:**
ఇంగ్లీష్ మాట్లాడగలిగే వ్యక్తులు సమాజంలో గౌరవం, ఆత్మవిశ్వాసం పొందుతారు. ఇంగ్లీష్ నేర్చుకోవడం వల్ల గ్రామీణ యువతకు నగరాలలో, అంతర్జాతీయ స్థాయిలో సమానంగా పోటీపడే అవకాశం లభిస్తుంది. ఉదాహరణకు, ఒక రైతు కుమారుడు ఇంగ్లీష్ నేర్చుకొని బీపీవో ఉద్యోగంలో చేరి తన కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవచ్చు.

చివరిగా...ఇంగ్లీష్ భాషను అవమానించడం కంటే, దాని ప్రాముఖ్యతను గుర్తించి, భారతీయ భాషలతో సమన్వయం చేస్తూ ప్రోత్సహించాలి. ఇంగ్లీష్ ఒక భాష కాదు, అది జ్ఞానం, అనేక అవకాశాలు ఇచ్చే జ్ఞాన భాండాగారం, ప్రపంచ సమైక్యతకు ద్వారం. హిందీ, తెలుగు, సంస్కృతం వంటి భాషలతో పాటు ఇంగ్లీష్‌ను కూడా నేర్చుకోవడం ద్వారా భారతీయ యువత ప్రపంచ స్థాయిలో రాణించగలదు. అమిత్ షా గారికి ఈ భాష గొప్పతనాన్ని అర్థం చేసుకొని, అన్ని భాషలను సమానంగా గౌరవించే విధంగా మాట్లాడాలని కోరుతున్నాము.నిజానికి భాష యొక్క అవసరం భావ వ్యక్తీకరణ కు తోడ్పడేదే. ఒక్కొక్కసారి మౌనం కూడా భాషే. మన మనో భావాలను (ఫీలింగ్స్)ను వ్యక్తం చేస్తుంది. అన్ని భాషలూ గొప్పవే. ఇందులో ఎక్కువ, తక్కువ అనే అభిప్రాయాలు అవసరం లేదు.లిపి లేని భాషలు కూడా వేల సంఖ్యలో భావం పంచుకోవటానికి ఉపయోగపడుతున్నాయి. ఏది ఏమైనా మన "అమ్మ" భాష, మనం పెరిగిన పరిసరాల్లో వినిపించిన భాష, పాటశాలలో నేర్చుకున్న భాషలు మన విజ్ఞాన పరిధిలను విస్తరింపచేసేవే. ప్రతి భాషకు తనదైన ఒక ప్రత్యేక ఉంటుంది. ప్రతి భాషలో పదాలలో స్పష్టమైన ఉచ్చారణ ఆ భాషకు ప్రాణం. భాషలో ప్రాంతీయ "యాస" ఆ భాష కు ఆభరణం. ఏ భాష "యాస" ఆ భాష కు సహజ "సౌందర్యాన్ని", "సొగసును" ఆవిష్కరిస్తూంది. ఒక భాషలోని భావాలు సాహిత్యం ద్వారా వ్యక్తం అవుతుంది. ఈసారి సాహిత్యం ఇతర భాషల్లోకి అనువాదం చేయండితే కొంత మేరకు 'ఒరిజినాల్టీ' తగ్గినప్పటికీ ఆ భాషలో భావాలు ఇతరులకు తెలియవస్తుంది. ఏ భాష అయినా సరే రాణించాలీ అంటే భాషకు ధారణ, గౌరవం లభించాలి . ఆ భాషకు తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉండాలి. రాజ్యం ఆధరణ ఎంత ఉంటే అంతగా ఆ భాష రాణిస్తుంది. మనకు ఎన్ని భాషలు తెలిస్తే అంతగా మన జ్ఞాన పరిధి అంతగా నలుదిశలా వ్యాపిస్తూంది.అన్ని భాషలను మన రాగద్వేషాలకు అతీతంగా ప్రేమించగలగాలి.అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. ఏ భాషను తక్కువ చేసి చూడరాదు. మనకు ఫలానా భాష రానంత మాత్రాన ఆ భాష వ్యర్థ కాదు. ఏ భాష గొప్పతనం దానిదే.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.
9849328496.

SV6 NEWS సమగ్ర సమాచార వారధి
SV6 దైవమ్ ఆధ్యాత్మిక వారధి
24/7 SV6 NEWS
మరియు
ఆధ్యాత్మిక వారధి SV6 దైవమ్ యూట్యూబ్
ప్రసారాలు అనునిత్యం మీకోసం





# బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడాన్ని బాధ్యతగా తీసుకోవాలి

- **సీపీ జీ.సుధీర్ బాబు**

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో :**

సంతోషంగా చదువుకుంటూ, ఆడుకుంటూ ఉండాల్సిన పిల్లల బాల్యాన్ని పాడుచేసే బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని రాచకొండ కమిషనర్ జి.సుధీర్ బాబు పిలుపునిచ్చారు.

ఆపరేషన్ ముస్కాన్XI కన్వర్జెన్స్ సమావేశం మంగళవారం నేరదేమెట్‌లోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. బాల కార్మిక వ్యవస్థ సమాజంలో ఒక వ్యాధిగా మారిందని, ఇది చాలా మంది అమాయక పిల్లల బాల్యాన్ని నాశనం చేస్తోందని అభిప్రాయపడ్డారు. బాల కార్మికులకు మూల కారణం ప్రధానంగా తల్లిదండ్రుల పేదరికం, బలవంతపు భిక్షాటన చేపించే వారి బారిలో చిక్కుకుని వారి బంగారు భవిష్యత్తును కూడా కోల్పోతున్నారని సీపీ అన్నారు. పేదరికం కారణంగా సంఘ వ్యతిరేక శక్తుల చేతుల్లో చిక్కుకున్న పిల్లలు కొన్నిసార్లు బాల నేరస్థులుగా మారే అవకాశం ఉందని, సంఘ వ్యతిరేక శక్తులు చిన్న పిల్లలను ఉపయోగించి నేరాలకు పాల్పడే అవకాశం కూడా ఉందని ఆయన అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కార్మిక మార్కెట్‌లోకి నెట్టవద్దని సీపీ సూచించారు. పిల్లల విద్య కోసం ప్రభుత్వం అనేక ఉచిత సంక్షేమ కార్యక్రమాలు మరియు పథకాలను అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సీపీ సూచించారు. బాల కార్మికుల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఉండాలని, దీనిని ప్రజలు కూడా తమ నైతిక బాధ్యతగా పరిగణించాలని ఆయన అభిప్రాయపడ్డారు. రాచకొండ నుండి మానవ అక్రమ రవాణా మరియు బాల కార్మికులను నిర్మూలించడానికి కఠినమైన చర్యలు తీసుకుంటున్నట్లు సీపీ పేర్కొన్నారు. మానవ అక్రమ రవాణాపై మేము ఉక్కుపాదం మోపుతున్నాము మరియు ప్రత్యేక బృందాల ద్వారా పిల్లలను రక్షించాము మరియు అక్రమ రవాణాదారులపై కేసులు నమోదు చేయబడ్డాయని ఆయన తెలిపారు. ఒడిశా మరియు బీహార్ వంటి ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చిన కార్మికుల కోసం వారి ప్రాంతంలో వర్క్ సైట్ పాఠశాలలు ఏర్పాటు చేయబడ్డాయని, తద్వారా వారి పిల్లలు వారి విద్యను కొనసాగిస్తారని ఆయన గుర్తు చేశారు. ఈ సమావేశంలో డిసిపి మహిళా భద్రతా టి. ఉష, సిడబ్ల్యుసి చైర్ పర్సన్లు కె.నరేందర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా ఎ.ఎం. రాజారెడ్డి, మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా, బి. జయశ్రీ, యాదాద్రిభోంగిరి జిల్లా, టి. శ్యామ్ ప్రసాద్, ఆర్‌డిఓ, మల్కాజ్‌గిరి, కె.నర్సింహారావు, డిడబ్ల్యుఓ, యాదాద్రిభోంగిరి జిల్లా, ఎం.పూర్ణ చందర్, ఎడి ఓ/ఓ డిఇఓ, విద్య, ఆర్.ఆర్. జిల్లా, డాక్టర్ జి. శోభా రాణి, డిప్యూటి డిఎంహెచ్ఓ, మేడ్చల్‌మల్కాజ్‌గిరి, డాక్టర్ గీత, డిప్యూటి డిఎంహెచ్ఓ, రంగారెడ్డి జిల్లా, ఎ. వెంకటేశ్వర్లు, అసోసియేషన్ ఫర్ వాలంటరీ యాక్షన్ కోఆర్డినేటర్, మేడ్చల్‌కు చెందిన డీసీపీఓ ఎండి.ఇంత్యాజ్ రహీమ్, రంగారెడ్డికి చెందిన డీసీపీఓ జి.ప్రవీణ్ కుమార్, యాదాద్రి జిల్లాకు చెందిన డీసీపీఓ కవిత, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పి.సాయి సుమన్, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్. దేవేందర్, అన్ని రెవెన్యూ, హెల్త్, ఎడ్యుకేషన్, లేబర్ డిపార్ట్‌మెంట్ల అధికారులు, ఎన్జీఓ చైల్డ్‌లైన్,(9) డివిజనల్ టీమ్ ఆఫీసర్లు, ఏహెచ్‌టీయూ సిబ్బంది పాల్గొన్నారు.



# మొగిలిగిద్దలో ఘనంగా ఎల్లమ్మ తల్లిబోనాల ఉత్సవాలు

- **అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వై.రవీందర్ యాదవ్**
- **బుగ్గ కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన వై.రవీందర్ యాదవ్**

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో :**

ఫరూఖ్ నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో మంగళవారం శ్రీ ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగానే బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నాయకుడు వై. రవీందర్ యాదవ్ దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను పొందారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలలో బోనాల ఉత్సవాలకు ప్రత్యేక స్థానం ఉందని, ప్రతి యేటా ఆషాడ మాసంలో గ్రామ దేవతలకు బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. దేవాలయం ప్రాంగణం వద్ద గ్రామ బీఆర్ఎస్ నాయకుడు బుగ్గ కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తుల కోసం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఈ సందర్భంగా కొనియాడారు .ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, నాయకులు వీరేశం గుప్తా, రాయికల్ వెంకట్ రెడ్డి, రవి గౌడ్, నగరం శ్రీను, గ్రామ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సిగాసి ఫ్యాక్టరీ ప్రమా-దంపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలి..

- **ఐఎఫ్ టియు తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.గీత**

**జర్నలిస్టు డైరీ, సంగారెడ్డి :**

సంగారెడ్డి జిల్లా మున్సిపాలిటీ పరిధిలోని పాశం మైలారంలోని సిగా చి కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో పదుల సంఖ్యలో కార్మికులు మరణించడం అనేకమంది తీవ్ర క్షతగాత్రులైన సంఘటనపై సమగ్ర న్యాయచారణ జరిపించాలని ఐఎఫ్ టియు తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై గీత డిమాండ్ చేశారు. ఈ సంఘటనకు యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలని, ఈ దుర్ఘటనకు ఫ్యాక్టరీలో తగిన రక్షణ చర్యలు చేపట్టకపోవడం, లేబర్ డిపార్ట్మెంట్ పర్యవేక్షణ ఫ్యాక్టరీ ఇన్స్పెక్టర్ల ఇన్స్పెక్షన్ లేకపోవడం వలన జరిగిందని ఐ ఎఫ్ టి యు అభిప్రాయపడుతుందని, క్షతగాత్రులైన కార్మిక కుటుంబాలను అన్ని రకాలుగా ఆదుకోవాలని, సంబంధిత ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని తక్షణమే ప్రాసిక్యూట్ చేసి, సెక్షన్ 304 కింద క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, మరణించిన కార్మికుల కుటుంబానికి ఒక్కొక్కరికి రూ.కోటి రూపాయలు చొప్పున ఎక్స్గ్రేషియా చెల్లిస్తూ కుటుంబానికి ఒక ఉద్యోగాన్ని ఇవ్వాలని, తీవ్రంగా క్షతగాత్రులైన కార్మికులకు రూ.50 లక్షలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలని, కార్పొరేట్ స్థాయిలో వైద్యాన్ని ప్రభుత్వ పరివేక్షణలో యాజమాన్యం, ప్రభుత్వం పూర్తిస్థాయిలో వారు( కార్మికులు) సంపూర్ణంగా కోరుకునే వరకు అందించాలని డిమాండ్ చేశారు.

# మెగా జాబ్ మేళా బ్రోచర్ ఆవిష్కరణ

- **నిరుద్యోగులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి**
- **ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, వికాస పిడి లక్ష్మణరావు**

**జర్నలిస్ట్ డైరీ, జగ్గంపేట :**



గోకవరం రోడ్ లోని సాయి బాలాజీ ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్న జ్యోతుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళా బ్రోచర్ వికాస పిడి లక్ష్మణరావు ఆధ్వర్యంలో జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వికాస పిడి లక్ష్మణరావు మాట్లాడుతూ.. జులై ఐదో తేదీ శనివారం జగ్గంపేట గోకవరం రోడ్డు లోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ఆదేశాలతో కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్, కాకినాడ వికాసా సంయుక్తంగా నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా కు జగ్గంపేట నియోజకవర్గం లోని జగ్గంపేట, గండేపల్లి, గోకవరం, కిర్లంపూడి మండలాల్లో నిరుద్యోగులు అందరూ ఈ జాబ్ మేళాకు వచ్చి ఉద్యోగాలు సాధించాలని ఈ జాబ్ మేళాలో సాఫ్ట్ వేర్, ఫార్మా, బ్యాంకింగ్, బిపిఓ, టెక్నికల్ రంగాలకు చెందిన సుమారు 33 కంపెనీలలో 1350 మందికి ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని అని అన్నారు. పదో తరగతి నుండి పీజీ వరకు చదువుకున్న 45 సంవత్సరాలు లోపు వారందరూ అర్హులు అన్నారు. రూ.13000 నుండి 45 వేల వరకు జీతం లభిస్తుందని ఉద్యోగాన్ని పెట్టి భోజనం వసతి వంటి సౌకర్యాలు కూడా లభిస్తాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి ఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, మారిశెట్టి భద్రం, పోతుల మోహనరావు, కందుల చిట్టిబాబు, చదరం చంటిబాబు, శీలం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# పెన్షన్ల పంపిణీలో పాల్గొన్న టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు

- **పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**

**జర్నలిస్ట్ డైరీ, గండేపల్లి :**



సంక్షేమం,అభివృద్ధి రెండింటిలోనూ కూటమి ప్రభుత్వం దూసుకుపోతుందని గండేపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోతుల మోహనరావు వ్యాఖ్యానించారు. గండేపల్లి మండలం సింగరంపాలెం గ్రామంలో మంగళవారం ఉదయాన్నే ఆయన పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి సామాజిక పెన్షన్ లు అందించారు. ప్రజలకు సంక్షేమ ఫలాలు సకాలంలో అందించడంలో భాగంగా ప్రతీ నెల 1వ తేదీనే పెన్షన్లు అందిస్తున్నామన్నారు. ఒక పక్క అభివృద్ధిని పరుగులు పెట్టిస్తూ.. మరొక పక్క సంక్షేమం అందించడంలోనూ కూటమి ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, నియోజకవర్గంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నిరంతరం ప్రజా సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం పనిచేస్తున్నారని చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం రూ.3 వేల రూపాయల పెన్షన్ ఒక్కసారిగా రూ.4 వేలు చేసి అందించడమే కాకుండా దివ్యాంగులకు రూ.6 వేలు, కిడ్నీ, గుండె అనారోగ్య బాధితులకు రూ.10 వేలు, మంచానికి పరిమితమైన దివ్యాంగులకు రూ.15 వేలు అందిస్తూ వారి జీవించడానికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారని ప్రభుత్వం ఏడాది సుపరిపాలన తొలి అడుగులో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని ఇప్పటికే ఉచిత గ్యాస్, తల్లికి వందనం, అందించడం జరిగిందని తొందరలోనే అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పూ్యర్ టు రిచ్ పీ ఫోర్ పథకాన్ని కూడా అమలు చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారని మోహన్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో అక్కిన సుదర్శన్ రావు, బోళ్ల సతీష్, అక్కిన నాగేశ్వరరావు, కుక్కల రమేష్, కుక్కల సురేష్, బుజ్జి, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.



# గుండారం గ్రామంలో

- **ప్రీ ప్రైమరీ ప్రభుత్వ పాఠశాల ప్రారంభం**

**జర్నలిస్ట్ డైరీ, బెజ్జంకి :**

బెజ్జంకి మండలంలోని గుండారం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతి ఆధ్వర్యంలో ప్రీ ప్రైమరీ పాఠశాల,ఆట వస్తువులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రత్యేక అధికారి భాస్కర్,విశిష్ట అతిథి మండల విద్యాధికారి మహతి లక్ష్మి హాజరై ప్రారంభించారు. జిల్లా ప్రత్యేక అధికారి భాస్కర్ మాట్లాడుతూ గుండారం గ్రామ ప్రజలు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని,పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు కలిపిస్తున్నామనీ, రాబోయే రోజుల్లో పాఠశాల అభివృధి కి కంప్యూటర్లు కూడా కేటాయిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీరాములు హై స్కూల్ హెచ్ఎం నాగవేణి,పూర్వ ప్రధానోపాధ్యాయులు రామంచ రవీందర్,ఉపాధ్యాయులు శ్రీనివాస్ ,గ్రామస్తులు ఎల్కాంటి శ్రీనివాస్ రెడ్డి,ఎలుక దేవయ్య,సాన వేణు,విద్యార్థుల తల్లిదండ్రులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నీటి సంపులో పడి రెండేళ్ల చిన్నారి మృతి

**జర్నలిస్ట్ డైరీ, కోదాడ గ్రామీణం:**

పెద్దలను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకున్న తల్లిదండ్రులకు నీటి సంపు రూపంలో పుత్రశోకం మిగిల్చిన ఘటన మండల పరిధిలోని గుడిబండలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై అనిల్ రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీపాది గోపినాగేశ్వరి దంపతులు మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరి కుమారుడు శ్రీపాది మహదేవ్ అలియాస్ లక్కీ (20 నెలలు) ను తమ ప్రేమకు ప్రతిరూపంగా అల్లారుముద్దుగా చూసుకుంటున్నారు. తండ్రి గోపి ప్రతిరోజు వడ్రంగి పనికి వెళ్తుండగా, తల్లి చిన్నారి ఆలనా పాలన చూసుకుంటూ ఉండేది.

రోజులాగానే గోపి పనికి వెళ్లగా తల్లి నాగేశ్వరి చిన్నారికి మధ్యాహ్నం సమయంలో భోజనం తినిపించింది. అనంతరం ఇద్దరూ కలిసి నిద్రపోయారు. తల్లి నిద్ర నుంచి మేల్కొనక ముందే చిన్నారి నిద్రలేచాడు. ఇంటి ఆవరణలోని నీళ్ల సంపువైపు వెళ్లగా.. దానిపై ఎలాంటి రక్షణ లేకపోవడంతో అందులో పడి మునిగిపోయాడు. కాసేపటికి నిద్ర లేచిన తల్లి చిన్నారి పక్కన లేకపోవడంతో కంగారుపడి స్థానికులతో కలిసి చుట్టుపక్కల వెతికింది. చివరకు సంపులో చూడగా చిన్నారి మహదేవ్ విగతజీవిగా పడి ఉన్నాడు. బయటకు తీసి కోదాడ ప్రభుత్వాసులకి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చిన్నారి మృతదేహానికి వైద్యులు మరణోత్తర పరీక్షలు నిర్వహించారు. తండ్రి గోపి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

## మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలుడు అదృశ్యం

**జర్నలిస్ట్ డైరీ, మీర్ పేట్(జులై 01):**

మీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చిప్ప ఆకాశ్ అనే 14 ఏళ్ల బాలుడు అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం స్థానిక అశోక్ రెడ్డి నగర్‌లో నివసించే శేఖర్ రెండో కుమారుడు మానసిక వైకల్యంతో బాధపడుతున్నాడు. గత నెల 25 మధ్యాహ్నం 2 గం.ల నుంచి కనపడుట లేదని మీర్ పేట్ పోలీస్ స్టేషన్‌లో తండ్రి శేఖర్ ఫిర్యాదు చేశాడు. ఆ రోజు నుంచి ఆచూకీ లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఎత్తు 5 అడుగులని, కనిపించకుండా పోయిన రోజు బ్లూ షర్ట్, ప్యాంట్ ధరించాడని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆచూకీ తెలిసిన వారు తండ్రి శేఖర్ నంబర్లు 6301961721, 9701574503 లలో సంప్రదించగలరు.



# ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన కల్పించండి

- **రూపాయి ఖర్చు లేకుండా వైద్య సేవలపై ఏఎన్ఎంల ద్వారా ప్రజలకు వివరించండి**
- **కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి**
- **మానకొండూరు పీహెచ్‌సీ సందర్శన**
- **భవిత కేంద్రం పరిశీలన.. అధికారులకు సూచనలు**
- **దివ్యాంగ విద్యార్థులతో ముచ్చట్లు.. ఆటలు**
- **డాక్టర్స్ డే సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు**
- **ఇండ్ల నిర్మాణంపై లబ్దిదారులతో మాటామంతీ**

**జర్నలిస్టు డైరీ, మానకొండూర్ :**





ప్రభుత్వ హాస్పిటళ్లలో రూపాయి కూడా ఖర్చు లేకుండా ప్రజలకు అనేక సేవలు అందిస్తున్నామని, ఈ విషయాలపై ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని వైద్యాధికారులకు కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మంగళవారం మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, లేబర్ రూమ్, మెడికల్ స్టోర్‌ను పరిశీలించి వివిధ రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా 100 శాతం మహిళలకు వైద్య పరీక్షలు చేయాలని ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని, మహిళా కార్యక్రమాల ద్వారా ఆరోగ్య సేవల ప్రగతిని తెలిపేలా ప్రతి శుక్రవారం బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ వైద్యశాలల్లో బీపీ, షుగర్ వంటి వ్యాధులకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉంటాయన్న విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని చెప్పారు. డాక్టర్స్ డే సందర్భంగా సిబ్బందితో కలిసి వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు.

**దివ్యాంగ విద్యార్థులు ఆటలు**

మానకొండూర్‌లోని భవిత కేంద్రాన్ని కలెక్టర్ పమేలా సందర్శించి దివ్యాంగ విద్యార్థులతో ముచ్చటించారు. వారితో కలిసి పలు ఆటలు ఆడి అలరించారు. పెయింటింగ్ పనులను పరిశీలించారు. భవిత కేంద్రానికి ఏవైనా అవసరాలు ఉంటే తమ దృష్టికి తేవాలని అధికారులకు సూచించారు. దివ్యాంగుల మనోవికాస అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. అవసరమైన వారందరికీ స్పీచ్ థెరపీ ఇప్పించాలని చెప్పారు. అనంతరం భవిత కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు.

**ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన**

మానకొండూర్‌లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను కలెక్టర్ పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణంలో ఏవైనా సమస్యలు ఉన్నాయా? అని ఆరా తీశారు. వేగంగా నిర్మాణం పూర్తి చేసుకోవాలని, దశలవారీగా సొమ్ము జమ చేయిస్తామని చెప్పారు. గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల సంఖ్య, గ్రౌండింగ్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలు వేగవంతం కోసం లబ్ధిదారులను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. ఖర్చు, మెటీరియల్, ఇసుక తదితర వివరాలపై ఆరా తీశారు. ఇండ్లకు కావాల్సిన ఇసుకను టోకెన్ విధానం ద్వారా ఇస్తున్నామని, సరఫరాలో ఏవైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తేవాలని సూచించారు.

**పండ్లు, పూల మొక్కలు పెంచాలి**

మానకొండూర్‌లోని నర్సరీలో ఉన్న వివిధ రకాల మొక్కలను కలెక్టర్ పరిశీలించి అందుబాటులో ఉన్న మొక్కల సంఖ్య, రకాలనును అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎక్కువగా ఇష్టపడే మొక్కలు, పండ్లు, పూల మొక్కలను విరివిగా పెంచాలని సూచించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటించి సంరక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, మండల విద్యాధికారి మధుసూదన్, భవిత కేంద్రం ఇన్స్ట్రక్టర్లు ఉమ, రాంప్రసాద్, కార్యదర్శి రేవంత్ పాల్గొన్నారు.



## జగన్‌కు జడ్ ప్లస్ కేటగిరి భద్రత కల్పించండి.. హైకోర్టులో పిటిషన్

- **వైఎస్ జగన్ భద్రతపై హైకోర్టులో పిటిషన్..**
- **నెల్లూరు పర్యటనలో జడ్ ప్లస్ కేటగిరి భద్రత కల్పించాలి..**
- **ఆ విధంగా ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ పిటిషన్..**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ భద్రత వ్యవహారంపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది వైసీపీ.. వైఎస్ జగన్ నెల్లూరు జిల్లా పర్యటనలో జడ్ ప్లస్ కేటగిరి భద్రత కల్పించేటట్లు ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ హైకోర్టులో వైసీపీ లంచ్ మోషన్ పిటిషన్ వేసింది.. ఈ లంచ్ మోషన్ పిటిషన్ ను వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి దాఖలు చేశారు.. అయితే, ఈ పిటిషన్ పైన విచారణ చేపట్టింది హైకోర్టు.. మరోవైపు, వైఎస్ జగన్మోహన్ రెడ్డికి జడ్ ప్లస్ కేటగిరీ భద్రతపై రేపు కోర్టుకు సమాచారం ఇస్తామని ప్రభుత్వం తరపున న్యాయవాది.. హైకోర్టుకు తెలియజేశారు..

మరోవైపు, నెల్లూరులో వైఎస్ జగన్ హెలికాప్టర్ ల్యాండింగ్ కు అడిగిన చోట కాకుండా వేరే చోట అనుమతి ఇస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు పిటిషనర్.. అయితే, స్థానిక పరిస్థితుల దృష్ట్యా ల్యాండింగ్ ప్రాంతం నిర్ణయించినట్టు కోర్టుకు తెలియజేసింది ప్రభుత్వం.. కాగా, వైఎస్ జగన్, పల్నాడు జిల్లా పర్యటన తీవ్ర వివాదాస్పదంగా మారిన విషయం విదితమే.. జగన్ పర్యటనలో ఇద్దరు మృతిచెందడం.. జగన్‌పై కేసులు నమోదు చేయడం.. ఆ తర్వాత ఆయన బుల్లెట్ ప్రూఫ్ కారును సీజ్ చేయడం జరిగిపోయాయి..



## వల్లభనేని వంశీకి బిగ్ రిలీఫ్.. బెయిల్ మంజూరు చేసిన కోర్టు..

- **వల్లభనేని వంశీ మోహన్‌కు కోర్టులో భారీ ఉపశమనం..**
- **బెయిల్ మంజూరు చేసిన నూజివీడు కోర్టు..**
- **నకిలీ ఇళ్ల పట్టాల కేసులో వల్లభనేని వంశీకి బెయిల్..**
- **షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన కోర్టు..**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి అన్ని కేసుల్లో బెయిల్ మంజూరు అయింది.. ఇప్పటికే 10 కేసుల్లో వంశీకి బెయిల్ ముందస్తు కండిషన్ బెయిల్ ను వేర్వేరు కోర్టులు మంజూరు చేశాయి.. తాజాగా నకిలీ ఇళ్ల పట్టాల కేసులో నూజివీడు కోర్టు మంగళవారం వంశీకి బెయిల్ మంజూరు చేయటంతో.. అన్ని కేసుల్లో వంశీకి బెయిల్ మంజూరైనట్టు అయింది. దీంతో రేపు వంశీ జైలు నుంచి విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 12వ తేదీన వంశీ అరెస్ట్ అయ్యారు.. అప్పటినుండి జైల్లో రిమాండ్ ఖైదీగా వంశీ ఉన్నారు. వంశీ పై అక్రమ మైనింగ్, నకిలీ ఇళ్ల పట్టాలు, భూ ఆక్రమణలు.. వంటి పలు ఆరోపణలకు సంబంధించిన కేసులు నమోదు అయ్యాయి.

ఇప్పుడు అన్ని కేసుల్లో బెయిల్, ముందస్తు బెయిల్ రావడంతో.. వంశీ రేపు విజయవాడ సబ్ జైలు నుంచి విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయి.. వంశీకి మైనింగ్ కేసులో మంజూరు చేసిన బెయిల్ రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.. దీన్ని రేపు సుప్రీంకోర్టు విచారణ చేయనుంది. గన్నవరంలో సీతామహాలక్ష్మి అనే మహిళ భూమి ఆక్రమించారన్న కేసుకు సంబంధించి ఇచ్చిన బెయిలు రద్దు చేయాలని సీతామహాలక్ష్మి కూడా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు అది త్వరలో విచారణకు రానుంది..

## పుట్టుకతోనే లివర్ సమస్య.. 6 నెలల చిన్నారి ప్రాణాలు నిలిపిన మంత్రి లోకేష్..

- **వైద్యసాయం అందించి ప్రాణాలు నిలిపిన మంత్రి లోకేష్..**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

సమస్యలు తన దృష్టికి వచ్చిన వెంటనే స్పందించిన తగిన సాయం అందించడంలో ముందు ఉంటారు మంత్రి నారా లోకేష్.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. విదేశాల్లో చితికిపోతున్న ఎంతో మందిని స్వదేశానికి రప్పించిన ఘనత ఆయన.. తాజాగా, పుట్టుకతోనే లివర్ సమస్యతో బాధపడుతున్న ఆరు నెలల చిన్నారికి వైద్యసాయం అందించి ప్రాణాలు నిలిపారు మంత్రి లోకేష్పూర్తి వివరాల్లోకి వెళ్తే.. చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన గజ్జల దీపూ నాయుడు అనే చిన్నారి పుట్టుకతోనే లివర్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో మెరుగైన వైద్యం కోసం తల్లిదండ్రులు ప్రైవేటు ఆసుపత్రిని సంప్రదించారు. లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ చేయాలని, ఇందుకు రూ.20 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. పౌల్ట్రీ ఫామ్ లో పనిచేసే చిన్నారి తండ్రి జగదీష్ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం కావడంతో.. ఆర్థిక సాయం కోసం మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషాను కలవడం జరిగింది. దీంతో వైద్యఖర్చులకు గాను రూ.10 లక్షల వరకు ఎల్ వోసీ మంజూరుచేయడం జరిగింది. అయితే లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ కు అధికమొత్తం అవసరం కావడంతో చిన్నారి తల్లిదండ్రులు మంత్రి లోకేష్ ను కలిసి విన్నవించారు. దీంతో, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్యసాయాన్ని రూ.15 లక్షల వరకు పెంచే ఏర్పాటు చేసారు లోకేష్.. ఒక్కరోజులోనే స్పందించి చిన్నారికి అండగా నిలవడం పట్ల మంత్రి నారా లోకేష్ కు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



## రౌడీలతో పోరాటం చేస్తున్నా.. వికాసం.. విధ్వంసం మధ్య యుద్ధం..!

- **నేను రౌడీలతో పోరాటం చేస్తున్నా..**
- **రాష్ట్రంలో వికాసం.. విధ్వంసం మధ్య యుద్ధం..**
- **కొవ్వూరు పర్యటనలో సీఎం సంచలన వ్యాఖ్యలు..**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**



నేను రౌడీలతో పోరాటం చేస్తున్నా.. రాష్ట్రంలో వికాసం.. విధ్వంసం మధ్య యుద్ధం జరుగుతుందన్నారు ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు.. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పర్యటనలో.. పెన్షన్లు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు.. ఆ తర్వాత ప్రజా వేదికపై మాట్లాడుతూ.. .వికాసం.. విధ్వంసం మధ్య యుద్ధం జరుగుతుందన్నారు.. ఆర్థిక వ్యవస్థ విధ్వంసం అయ్యింది.. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, సంక్షేమ విజయాలను ఇంటింటికి తీసుకెళ్లేందుకు కార్యాచరణ సిద్ధం చేశాం.. ఏడాది కాలంలో సాధించిన విజయాలు, సంక్షేమం, అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణతో నాంది పలికాం.. ఎంత పెద్ద మొత్తంలో ఫించన్లు ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే అన్నారు.. డబ్బులు ఇవ్వడమే కాదు ఒకటోవ తేదీనే పింఛన్లు ఇంటింటికి పంపిణీ చేస్తున్నాం.. సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్ల ఇస్తున్నాం.. తల్లి వందనం క్రింద 10 వేల కోట్ల రూపాయలు వేశాం.. ధాన్యం కొనుగోలులో కొన్ని ఇబ్బందులు వచ్చిన తరువాత కూడా రైతుల ఖాతాలో డబ్బులు.. ఆగస్టు 15వ తేదీన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించబోతున్నాం అని వెల్లడించారు.

పింఛన్లు సక్రమంగా అందించాలనే ఉద్దేశంతో నేనే నేరుగా గ్రామాలకు వచ్చి పంపిణీ చేస్తున్నాను... పేద వాడిని చిన్న చూపు చూస్తే సహించను అని హెచ్చరించారు సీఎం చంద్రబాబు.. నేను కష్టపడుతుంది పేదల కళ్లల్లో ఆనందం కోసం.. అర్హులందరికీ ఫించన్లు మంజూరు చేస్తా అని హామీ ఇచ్చారు.. గత ప్రభుత్వంలో వైసీపీ కార్యకర్తలకు ఇచ్చారని విమర్శించారు.. ఇక, ఎవరైనా డ్రగ్స్, గంజాయి వాడిని తాట తీస్తాం అని హెచ్చరించారు... డ్రగ్స్ కు బానిసలై తల్లికి,చెల్లికి, పెళ్లానికీ తేడా లేకుండా అత్యాచారాలకు పాల్పడుతున్నారు.. ఓ ఆడపిల్ల పైన అయిన చేయి వేస్తే అదే చివరి రోజు అవుతుందని వార్నింగ్ ఇచ్చారు సీఎం చంద్రబాబు..

ఇక, నేను, ప్రధాని మోడీ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అందరం సాధారణ కుటుంబంలో పుట్టిన వారమే.. లక్ష కుటుంబాలను దత్తత తీసుకున్న, పది వేల మార్గదర్శకులు ముందుకు వచ్చారని తెలిపారు చంద్రబాబు.. రాష్ట్రానికీ పది లక్షల కోట్లు అప్పులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.. గత వైసీపీ ప్రభుత్వంలో పోలవరం విధ్వంసం అయ్యింది.. డయాఫ్రం వాల్ దెబ్బతిని నిర్మాణం జరగలేదని విమర్శించారు. కానీ, గడిచిన ఏడాదిలో పోలవరం ప్రాజెక్టు పనులు 6 శాతం పూర్తి చేశాం.. ఇప్పటికీ. 82 శాతం పనులు పూర్తి అయ్యాయి.. పోలవరం ప్రాజెక్టును 2027కి పూర్తి చేస్తాం అని హామీ ఇచ్చారు చంద్రబాబు..

రాజకీయాలకు రౌడీలు వస్తున్నారు.. రౌడీలే రాజ్యమేలే పరిస్థితికి చేరారు అని మండిపడ్డారు సీఎం చంద్రబాబు.. వైఎస్ వివేకానంద హత్య కేసులో నన్ను మోసం చేశారు.. పోస్టుమార్టం కూడా చేయకుండా అంత్యక్రియలు చేయడానికీ ప్రయత్నించారు.. గుండెపోటు అని నమ్మించారు.. పోస్టుమార్టం చేస్తే గుండెపోటు కాదు కత్తి పోటు అని తేలిందని గుర్తుచేశారు.. రాష్ట్రంలో నేను రౌడీలతో పోరాటం చేస్తున్నా.. పెళ్లి చేసే ముందు ఏడు తరాలు వెనుకకు చూడటమే కాకుండా పుట్టు మచ్చలు సైతం చూస్తున్నారు.. కానీ, ఓటు వేసే ముందు ఇవేవి చూడకుండా వేస్తున్నారు అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు సీఎం చంద్రబాబు..

## మృత్యువు కూడా విడదీయలేని ప్రేమ.. సిగాచి పేలుడులో నవ దంపతులు మృతి.. ఎమ్మెల్యే భావోద్వేగం..!

- **మృత్యువు కూడా విడదీయలేని ప్రేమ..**
- **సిగాచి పేలుడులో నవ దంపతులు మృతి..**
- **టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు భావోద్వేగం..**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**



ప్రేమించుకున్నారు.. కలిసి నడుద్దాం అనుకున్నారు.. ప్రేమ పెళ్లి చేసుకున్నారు.. ఇద్దరూ కలిసి కొత్త జీవితాన్ని ప్రారంభించారు.. నీకు నేను.. నాకు నువ్వు అనుకున్నారు.. ఈ ఇద్దరి ప్రేమకు ఆ రెండు కుటుంబాలు కూడా ఒప్పుకున్నాయి.. ఇద్దరూ ఒకే దగ్గర ఉద్యోగంలో చేరారు.. అయితే, వారి ప్రేమను మృత్యువు కూడా విడదీయలేదు.. తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో జరిగిన పేలుడు ఘటన చాలా కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపగా.. మృతదేహాలకు పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం చేశారు వైద్యులు.. అయితే, ఈ పేలుడులో ఏపీకి చెందిన నవదంపతులు మృత్యువాతపడ్డారు. కడప జిల్లాకు చెందిన నిఖిల్ కుమార్ రెడ్డి, రమ్యశ్రీ దుర్మరణంపాలయ్యారు.. సిగాచి పరిశ్రమ ల్యాబ్‌లో పని చేస్తున్న నిఖిల్ కుమార్ రెడ్డి, రమ్యశ్రీ.. రెండు నెలల క్రితమే ప్రేమ వివాహం చేసుకున్నారు.. వివాహం అనంతరం ఇటీవలే విధుల్లో చేరారు ఈ నవదంపతులు.. నిన్న జరిగిన పేలుడులో ఇద్దరూ ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది.. పోస్టుమార్టం చేసిన తర్వాత ఇద్దరి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు పోలీసులు. నిఖిల్ రెడ్డి మృతదేహాన్ని కడప జిల్లాకు తరలించడగా.. రమ్యశ్రీ డెడ్ బాడీని ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటకు తరలించారు కుటుంబ సభ్యులు..

ఈ ఘటనపై టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు భావోద్వేగానికి గురయ్యారు.. ఆ నవదంపతులతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ.. కన్నీళ్లు ఆగడం లేదని ఆయన పేర్కొన్నారు.. ప్రారంభంలోనే ముగిసిన ప్రయాణం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.. కడప జిల్లా జమ్మలమడుగు సమీపంలో ఒక చిన్న గ్రామానికి చెందిన రైతు బిడ్డ నిఖిల్ రెడ్డి... ఎమ్మెస్సీ చదువుకొని పటాన్‌చెరువు సమీపంలో ఒక ఫార్మా కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం విస్సన్నపేట మండలంలో పుట్రేల గ్రామంలో సౌత్ మాలపల్లిలో ఒక రైతు కూలీ కుటుంబంలో పుట్టిన రామాల శ్రీ రమ్య.. తిరుపతి పద్మావతి మహిళ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ చదివింది. నిఖిల్ రెడ్డి పనిచేస్తున్న ఫార్మా కంపెనీలోనే ఉద్యోగం సంపాదించుకుంది. పిల్లలు ఇద్దరు అత్యంత సాధారణ కుటుంబాల నుంచి కష్టపడి చదువుకొని స్వయంకృషితో ఉద్యోగాలు సంపాదించుకున్నారు. మంచి స్నేహితులుగా మారిన వాళ్లు పరస్పరం ఇష్టపడి వివాహం చేసుకోవాలని నిర్ణయానికి వచ్చిన తర్వాత... వారి కుటుంబాలకు తెలియజేశారు. వారి ప్రేమ వివాహానికి చిన్న చిన్న అవరోధాలు ఏర్పడ్డాయి. కొన్ని నెలలపాటు తీవ్ర మనోవేదన అనుభవించిన ఆ యువ జంట... సహాయం కోసం నాతో మాట్లాడారని గుర్తుచేసుకున్నారు..

నేను మొదట నిఖిల్ రెడ్డి అమ్మగారితో మాట్లాడాను... ఆమె చాలా స్పష్టంగా ఒక మాట చెప్పారు... నాకు ఇద్దరు మగ పిల్లలు... ఇప్పుడు నా పెద్ద కొడుకు నిఖిల్... ఇష్టపడి రమ్యని కోడలుగా మా ఇంటికి తీసుకు వస్తే... ఆ పాపని మా సొంత కూతురు లాగా చూసుకుంటాం అన్నారని ఎమ్మెల్యే శ్రీనివాసరావు పేర్కొన్నారు.. వాళ్ల పెళ్లికి మాకు ఎలాంటి అభ్యంతరం లేదు.. అని ఆ తల్లి చెప్పింది. ఆమె మాటలు విన్న తర్వాత.. రమ్య కుటుంబ సభ్యులకు నేనే ధైర్యం చెప్పి, రెండు కుటుంబాల మధ్య సంప్రదింపులు మొదలుపెట్టాం.. రెండు కుటుంబాలు కలుసుకున్నాయి.. రెండు కుటుంబాల పెద్దలు చాలా ఆత్మీయంగా మాట్లాడుకుని, ఆషాడ మాసం తర్వాత మంచి ముహూర్తం చూసి పిల్లలకు పెళ్లి చేద్దామని నిర్ణయానికి వచ్చారని తెలిపారు.. అయితే, ఇది జరిగిన తర్వాత.. పిల్లలిద్దరిని హైదరాబాద్‌లో మా ఇంటికి పిలిచి.. ధైర్యం చెప్పి.. బట్టలు పెట్టి పంపించడం జరిగింది.. అంటూ దానికి సంబంధించిన ఫొటోను కూడా షేర్ చేశారు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు.. నాలుగు రోజుల క్రితం రమ్య కుటుంబ సభ్యుల నుండి... త్వరలో నిశ్చితార్థం పెట్టుకుంటాము.. మీరు తప్పనిసరిగా రావాలి. అని ఆహ్వానం అందింది. నేను కూడా వస్తాను అని చెప్పినట్టు పేర్కొన్నారు..

అయితే, నిన్న తిరువూరు నియోజకవర్గంలో వరుస కార్యక్రమాలతో బిజీగా ఉన్న నాకు... ఫార్మా కంపెనీలో పేలుడు గురించి, భారీ ప్రాణ నష్టం గురించి తెలియగానే.. ఈ పిల్లలు పనిచేస్తున్న కంపెనీ పేరు తెలుసుకోవటానికి... ముందుగా నేను నిఖిల్ రెడ్డికి ఫోన్ చేశాను.. ఆ తర్వాత రమ్యకి ఫోన్ చేశాను.. ఇద్దరి నుంచి స్పందనలేకపోవడంతో.. రమ్య అక్కకు ఫోన్ చేశాను రెస్పాన్స్ లేదు.. తర్వాత టీవీ ఛానల్స్‌లో పేలుడు.. మృతుల్లో ఏపీకి చెందిన వారు ఉన్నట్లు చూశానని.. తర్వాత హైదరాబాద్ బయల్దేరి సాయంత్రం 6 గంటల వరకు ఫార్మా కంపెనీకి చేరుకున్నాను.. రమ్య అక్క జ్యోత్స్న... ఆమె స్నేహితులు మరో ముగ్గురు తీవ్ర విషాదంలో అక్కడే ఉన్నారని భావోద్వేగానికి గురయ్యారు.. అక్కడున్న కలెక్టర్ తో, పోలీస్ అధికారులతో మాట్లాడినప్పటికీ ఎవరు స్పష్టమైన సమాచారం ఇవ్వలేదు. గుర్తుపట్టలేనంతగా కాలిపోయిన అనేక మృతదేహాలను.. గాయపడ్డ వారిని సమీపంలో ఉన్న మూడు నాలుగు ఆసుపత్రులకు తరలించారు. ఉదయం నుంచి వర్షంలోనే తడుస్తూ.... కంపెనీ దగ్గరే ఉన్న రమ్య అక్కను.. ఆమె స్నేహితులను వాళ్ళ ఇంటిదగ్గర డ్రాప్ చేసి, నేను రాత్రి 9 తర్వాత మా ఇంటికి చేరుకున్నాను. ఉదయాన్నే బయలుదేరి మళ్లీ కంపెనీ దగ్గరికి వెళ్లాలని రాత్రి అనుకున్నాము. అయితే తెల్లవారే సమయానికి... నిఖిల్ రెడ్డి పాత రూమ్ మెట్ ఫోన్ చేసి.. వాళ్లిద్దరూ మనకు లేరు సార్ అని చెప్పాడు. మరి కాసేపటికి ..... ఇద్దరి మృతదేహాలను గుర్తించినట్టు.. ఆసుపత్రి నుండి రమ్య అక్కకు సమాచారం అందింది. ఈ మహా విషాదాన్ని తట్టుకోవడం... రెండు కుటుంబాలకు చాలా చాలా కష్టం. ఆ తల్లిదండ్రులు తట్టుకోలేని చేదు నిజం మిగిలింది. ఏం చెప్పాలో మాటలు రావడం లేదు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు ఎమ్మెల్యే శ్రీనివాసరావు..

ఇక, మా నాన్న 40 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ కోసం పనిచేశాడు... మా నాన్నకు ఏదైనా సహాయం చేయండి సార్ అని.. మొన్న రమ్య మా ఇంటికి వచ్చినప్పుడు అడిగింది. గత సంవత్సర కాలంలో ఆమె తల్లిదండ్రులు రెండుసార్లు నన్ను కలిశారు. మరి కొద్ది రోజుల్లో జరగబోయే పెళ్లి సందర్భంగా... వాళ్ళింటికి వస్తానని చెప్పాను. ఇంతలోనే... ఒక కన్నీటి ఉప్పెన.... ఆ పిల్లల స్వప్నాలను తుడిపేసింది. ఆ తల్లిదండ్రుల గుండెలకు చికిత్స లేని గాయం చేసింది. ఎంత కంట్రోల్ చేసుకున్నా ఆగని కన్నీళ్లతో మీ కొలికపూడి శ్రీనివాసరావు అంటూ బరువెక్కిన గుండెతో ఓ ప్రకటన విడుదల చేశారు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు.. కాగా, నిఖిల్ కుమార్ రెడ్డి, రమ్యశ్రీ.. ఆర్య సమాజ్‌లో ప్రేమ పెళ్లి చేసుకున్నా.. ఆ రెండు కుటుంబాలు మరోసారి వారికి గ్రాండ్‌గో వివాహం చేయాలని అనుకోగా.. ఇంతలోనే.. ఊహించని ఘటన.. ఆ కుటుంబాల్లో పెను విషాదాన్ని నింపింది..



## బీజేపీని రాష్ట్రంలో తిరుగులేని శక్తిగా మారుస్తా: పీవీఎన్ మాధవ్

- **అధ్యక్ష పదవికి ఏకగ్రీవంగా ఎన్నికైన మాధవ్**
- **బాధ్యతలను స్వీకరించిన అనంతరం మాట్లాడిన మాధవ్**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

బీజేపీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తిరుగులేని శక్తిగా చేసేలా పని చేస్తాను అని ఏపీ రాష్ట్ర అధ్యక్ష పదవి బాధ్యతలను చేపట్టిన పీవీఎన్ మాధవ్ అన్నారు. ఒక చేతిలో బీజేపీ జెండా, మరో చేతిలో కూటమి అజెండాతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్ష పదవి బాధ్యతలను మాజీ ఎమ్మెల్సీ మాధవ్ ఈరోజు స్వీకరించారు. ఈ పదవికి ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీ బీజేపీ అధ్యక్ష బాధ్యతలను రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాధవ్‌కు అప్పగించారు. బీజేపీ ఏపీ అధ్యక్ష పదవి బాధ్యతలను స్వీకరించిన అనంతరం పీవీఎన్ మాధవ్ మాట్లాడారు. 'నేను రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరిస్తున్నాను. పార్టీ, తను వేరు కాకుండా మా నాన్నగారు పని చేశారు. అత్యంత సాధారణంగా పని చేస్తున్న ప్రతీ కార్యకర్త పర్యటన ద్వారా కార్యక్రమాలు చేస్తారు. పదవి ఒక బాధ్యత అని సంఘంలో నేర్పించారు. బీజేపీని రాష్ట్రంలో తిరుగులేని శక్తిగా చేసేలా పని చేస్తాను. ఆర్ఎస్ఎస్ ప్రారంభం అయ్యి 100 సంవత్సరాలు పూర్తయిన సంవత్సరం 2025. ఎమర్జెన్సీకి 50 సంవత్సరాలు పూర్తయిన సంవత్సరం 2025. 2025లో అధ్యక్షుడిగా నేను బాధ్యతలు తీసుకోవడం నాకు ఆనందదాయకం. బాషా మధ్యమాన్ని రద్దు చేసి గత ప్రభుత్వం కళంకాన్ని తెచ్చింది. తెలుగును శాసన భాషగా తయారు చేసేలా పని చేస్తాం. ఒక చేతిలో బీజేపీ జెండా, మరో చేతిలో కూటమి అజెండాతో ముందుకు వెళ్ళాలి. యోగాంధ్రను ముందుకు తీసుకువెళ్ళాలి' అని మాధవ్ అన్నారు.

## బాలికల హాస్టల్‌లో హోం మంత్రి అనిత ఆకస్మిక తనిఖీలు.. ఊహించని ఘటన..!

- **పాయకరావుపేట బీసీ బాలికల కాలేజ్ హాస్టల్‌ను హోంమంత్రి..**
- **హాస్టల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన అనిత..**
- **మంత్రికి ఎదురైన ఊహించని అనుభవం..**
- **భోజనంలో బొద్దింక వచ్చిందని ప్రచారం..**
- **అది బొద్దింక కాదు.. వెంట్రుక అని క్లారిటీ ఇచ్చిన మంత్రి..**

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**



పాయకరావుపేట బీసీ బాలికల కాలేజ్ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సమయంలో ఏపీ హోంశాఖ మంత్రి వంగలపూడి అనితకు ఊహించని ఘటన ఎదురైంది.. హాస్టల్‌లో బాలికలతో కలిసి భోజనం చేస్తుండగా.. ఆమె తన ప్లేట్ వైపు చూసి.. కొంత ఆశ్చర్యానికి గురయ్యారు.. దీంతో, విద్యార్థులు అంతా నవ్వారు.. అయితే, ఇక్కడే హోంమంత్రి అనిత భోజనం చేస్తుండా.. ఆమె భోజనంలో బొద్దింక వచ్చిందనే ప్రచారం జరిగింది.. ఆ వార్తలపై ఈ రోజు క్లారిటీ ఇచ్చారు హోం మంత్రి అనిత..

సోమవారం రోజు తాను పాయకరావుపేట బీసీ బాలికల కాలేజీ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశానని తెలిపిన అనిత.. విద్యార్థులకు మంచి వసతలు కల్పించడమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యం అన్నారు.. పాయకరావుపేట హాస్టల్ లో మెనూ పాటించలేదు. వార్డెన్ అందుబాటులో లేరు.. హాస్టల్‌లో సెక్యూరిటీ కూడా లేరు.. దీంతో, వార్డెన్ ను సస్పెండ్ చేశామని తెలిపారు.. అన్ని హాస్టల్స్ ను తనిఖీలు చేయమని అధికారులను ఆదేశించామన్నారు.. అయితే, మంచిని కూడా చెడులాగ వైసీపీ వాళ్లు ప్రచారం చేస్తున్నారు.. వైసీపీ అఫిషియల్ ఫేజ్ లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.. భోజనంలో చిన్న తల వెంట్రుక కనిపించింది అన్నారు..

మరోవైపు, గత ఐదు సంవత్సరాల్లో ఒక ఎమ్మెల్యే అయినా హాస్టల్స్ కు వెళ్ళరా? అని నిలదీశారు మంత్రి అనిత.. శ్రీశైలం ప్రసాదంలో బొద్దింక అని నిన్న ప్రచారం చేశారు. ఈ రోజు భోజనంలో బొద్దింక అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు.. ఏదో రకంగా బురద జల్లాలని చూస్తున్నారని మండిపడ్డారు.. మేం చిత్తశుద్ధితో ఉన్నాం.. ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్నాం.. ఒక సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా తొలి అడుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు.. అసలు వైసీపీ వాళ్ళకు మానవత్వం ఉండదా? అధికారంలోకి రావాలి.. సీఎం కుర్చీలో కూర్చోవాలనే ఆలోచన తప్ప అని దుయ్యబట్టారు హోం మంత్రి వంగలపూడి అనిత.



### ఐసీసీ టీ20 బ్యాటర్ల ర్యాంకింగ్‌లో

# మూడవ స్థానంలో స్మృతి మంధాన

దుబాయ్: భారత మహిళా క్రికెటర్ స్మృతి మంధాన.. ఐసీసీ టీ20 ర్యాంకుల్లో టాప్ మూడవ బ్యాటర్‌గా నిలిచింది. వన్డేల్లో ఇప్పటికే వరల్డ్ నెంబర్ వన్ స్థానంలో ఉన్న ఆమె.. ఇంగ్లండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్ ఫస్ట్ మ్యాచ్‌లో సెంచరీ సాధించడంతో స్మృతి మంధాన తన పాయింట్ల పట్టికను మెరుగుపరుచుకున్నది. ఫస్ట్ టీ20లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు గాయం కావడంతో ఆ బాధ్యతలను స్మృతి మంధాన పోషించింది. మంధాన తన ఇన్నింగ్స్‌లో 15 ఫోర్లు, మూడు సిక్సర్లు కొట్టింది. కేవలం 62 బంతుల్లోనే ఆమె 112 రన్స్ చేసింది. నాటింగ్‌హామ్‌లో జరిగిన ఆ మ్యాచ్‌లో ఇండియా 97 రన్స్ తేడాతో విజయం సాధించింది.

లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ స్మృతి మంధాన తన కెరీర్‌లో అత్యుత్తమంగా 771 రేటింగ్ పాయింట్లు సాధించింది. దీంతో ఆమె మూడవ ర్యాంక్‌లో నిలిచింది. వెస్టిండీస్‌కు చెందిన హేలే మాథ్యూస్ 774, ఆస్ట్రేలియా బ్యాటర్ బేత్ మూనీ 794 పాయింట్లతో రెండో, మొదటి స్థానాల్లో నిలిచారు. భారతీయ మహిళా క్రికెటర్లలో షఫాలీ వర్మ, హర్లీన్ డియోల్.. రాణించారు. షఫాలీ వర్మ 13వ ర్యాంక్‌లో నిలిచింది. బౌలర్లలో పాకిస్తాన్ స్పిన్నర్ సాదియా ఇక్బాల్.. టీ20ల్లో టాప్‌లో నిలిచింది. 44 రేటింగ్ పాయింట్లతో ఆమె అగ్ర స్థానంలో ఉన్నట్లు ఐసీసీ తన ప్రకటనలో పేర్కొన్నది.

### అర్‌ష్‌దీప్ వద్దు!.. బుమ్రా స్థానంలో

# అతడే సరైనోడు: ఇర్ఫాన్ పఠాన్


ఇంగ్లండ్‌తో రెండో టెస్టుకు ముందు భారత మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ టీమిండియా నాయకత్వ బృందానికి కీలక సూచనలు చేశాడు. ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా స్థానాన్ని ఆకాశ్ దీప్‌తో భర్తీ చేస్తే బాగుంటుందన్నాడు. మహ్మద్ షమీ మాదిరి ఈ బెంగాల్ పేసర్ రాణించగలడని ఇర్ఫాన్ పఠాన్ అభిప్రాయపడ్డాడు.

ఐదు టెస్టులు ఆడేందుకు ఇంగ్లండ్‌కు వెళ్లిన టీమిండియా.. ఓటమితో ఈ సిరీస్‌ను మొదలుపెట్టింది. లీడ్స్‌లో జరిగిన తొలి టెస్టులో ఐదు వికెట్ల తేడాతో ఓటమిని చవిచూసింది. ఇక బుమ్రాపై పనిభారం తగ్గించే నిమిత్తం టీమిండియా మేనేజ్‌మెంట్ అతడిని ఇక్కడ కేవలం మూడు టెస్టుల్లో మాత్రమే ఆడించనుంది.

**షమీ మాదిరి ఆకట్టుకోగలడు**

ఈ నేపథ్యంలో బర్మింగ్‌హామ్‌లో జరిగే రెండో టెస్టుకు బుమ్రాకు విశ్రాంతినిస్తారని తెలుస్తోంది. ఈ విషయంపై స్పందించిన ఇర్ఫాన్ పఠాన్ తన యూట్యూబ్ చానెల్ వేదికగా అభిప్రాయాలు పంచుకున్నాడు.

''ఒకవేళ బుమ్రా గనుక ఈ టెస్టు ఆడకపోతే.. అతడి స్థానంలో సరైన బౌలర్ ఎవరంటే.. ఆకాశ్ దీప్. నెట్స్‌లో అతడి ప్రాక్టీస్ చూస్తుంటే.. షమీ మాదిరి ఆకట్టుకోగలడని అనిపిస్తోంది. సీమ్, స్వింగ్‌పై మరింతగా దృష్టి సారిస్తే.. కచ్చితంగా ఇంగ్లండ్ బ్యాటర్లను అతడు ఇబ్బందిపెట్టగలడు.



**అర్‌ష్‌దీప్ వద్దు!.. బుమ్రా స్థానంలో అతడే సరైనోడు**

అర్‌ష్‌దీప్ కూడా రేసులో ఉన్నాడు. కానీ బుమ్రా ఒకవేళ రెండో టెస్టు ఆడకపోతే అతడి స్థానంలో ఆకాశ్ దీప్‌ను తప్పక ఎంపిక చేయాలి'' అని ఇర్ఫాన్ పఠాన్ సూచించాడు. ఇదిలా ఉంటే.. మంగళవారం మీడియాతో మాట్లాడిన టీమిండియా కెప్టెన్ శుబ్‌మన్ గిల్.. బుమ్రా రెండో టెస్టుకు అందుబాటులో ఉంటాడని స్పష్టం చేశాడు. అయితే, అతడిని ఆడించే విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నాడు. మరోవైపు.. ఎడ్జ్‌బాస్టన్ పిచ్ పొడిగా ఉండనున్న నేపథ్యంలో చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ తుదిజట్టులోకి రావడం ఖాయమని మాజీ క్రికెటర్లు, విశ్లేషకులు అంటున్నారు. కాగా భారత్ ఇంగ్లండ్ మధ్య జూలై 26 వరకు రెండో టెస్టు నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారైంది. ఇదిలా ఉంటే.. ఆకాశ్ దీప్ టీమిండియా తరఫున ఇప్పటి వరకు ఏడు టెస్టులు ఆడి పదిహేను వికెట్లు తీశాడు. మరోవైపు.. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో దూసుకుపోతున్న అర్‌ష్‌దీప్.. సుదీర్ఘ ఫార్మాట్లో ఇంకా అరంగేట్రం చేయలేదు. ఇక టీమిండియాతో రెండో టెస్టుకు ఇంగ్లండ్ ఇప్పటికే తమ తుదిజట్టును ప్రకటించింది.

**భారత్‌తో రెండో టెస్టు కోసం ఇంగ్లండ్ తుది జట్టు ఇదే**

జాక్ క్రాలే, బెన్ డకెట్, ఓలీ పోప్, జో రూట్, హ్యారీ బ్రూక్, బెన్ స్టోక్స్ (కెప్టెన్), జేమీ స్మిత్ (వికెట్ కీపర్), క్రిస్ వోక్స్, బ్రైడన్ కార్స్, జోష్ టంగ్, షోయబ్ బషీర్.

### తొక్కిసలాటకు ఆర్సీబీ యాజమాన్యమే కారణం..

# పోలీసులను తప్పుపట్టలేం..!

భారత క్రీడా చరిత్రలో రెండో దుర్ఘటనగా పేర్కొనదగిన చిన్నస్వామి తొక్కిసలాట పలు కుటుంబాల్లో విషాదాన్ని నింపిన విషయం తెలిసిందే. తమ తొలిసారి ఐపీఎల్ ట్రోఫీ గెలుపొందిన తమ జట్టును చూసేందుకు పోటెత్తిన ఫ్యాన్స్‌లో 11 మంది అసువులు బాశారు. జూన్ 4న జరిగిన ఈ సంఘటనపై యావత్ భారతం ఆర్సీబీని దుమ్మెత్తిపోయగా తాజాగా కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ (CAT) కూడా సంచనల వ్యాఖ్యలు చేసింది. తొక్కిసలాటకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB) యాజమాన్యానిదే తొలి బాధ్యత అని క్యాట్ తెలిపింది.

ఐపీఎల్ ఛాంపియన్‌గా అవతరించిన ఆర్సీబీ మరుసటి రోజే కర్నాటకలో విజయయాత్రకు పిలుపునిచ్చింది. విధాన సౌధ నుంచి చిన్నస్వామి స్టేడియం వరకూ విక్టరీ పరేడ్‌లో నిర్వహిస్తామని, అభిమానులు భారీగా తరలిరావాలని బెంగళూరు ఫ్రాంచైజీ కోరింది. కానీ, అందుకు తగిన భద్రతా ఏర్పాట్లను మాత్రం చేయలేదు. అందుకే తొక్కిసలాటకు ఆర్సీబీ



యాజమాన్యమే ప్రథమ దోషి అని క్యాట్ అభిప్రాయపడింది.

'ఐపీఎల్ విజేతగా నిలిచిన తర్వాత బెంగళూరు టీమ్ ఎక్స్ వేదికగా విక్టరీ పరేడ్ పోస్ట్ పెట్టింది. ఆ పోస్ట్ చూసిన ఫ్యాన్స్ జూన్ 4న చిన్నస్వామికి భారీగా తరలివచ్చారు. 35 వేల సామర్థ్యం ఉన్న స్టేడియానికి 2.5లక్షల మంది రావడంతో పోలీసులు వాళ్లను అదుపు చేయలేకపోయారు. పైగా వాళ్లకు అంతమందిని నియంత్రించేందుక అవసమరైన బలగాలను సమకూర్చుకునే సమయం కూడా లేకపోయింది. అయినా పోలీసులేమీ దేవుళ్లు కాదు కదా.. అంతా క్షణాల్లో అదుపు చేయడానికి. సో.. ఈ దుర్ఘటనకు పోలీసుల నిర్లక్ష్యమే కారణమని చెబుతూ ఆర్సీబీ యాజమాన్యం తప్పించుకోవడానికి లేదని క్యాట్ వెల్లడించింది. చిన్నస్వామి తొక్కిసలాట తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చెలరేగాయి.

భారత క్రికెట్ నియంత్రణ మండలి సెక్రటరీ దేవ్‌జిత్ సైకియా(Devjit Saikia) సైతం ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేకుండా విక్టరీ పరేడ్ జరపడాన్ని ఖండించాడు. దాంతో, ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న కర్నాటక ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఫలితంగా ఆర్సీబీ, కర్నాటక క్రికెట్ సంఘం, ఈవెంట్ ప్లానింగ్ సంస్థపై కేసులు నమోదయ్యాయి. అనంతరం కేసీసీఏ సెక్రటరీ ఏ శంకర్, కోశాధికారి జయరామ్ రాజీనామా చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా బీసీసీఐ మార్గదర్శకాలు జారీ చేసింది.



## శాంసన్‌పై సూపర్ కింగ్స్ కన్ను.. మరో ఐదుగురిని వదిలేస్తున్న రాజస్థాన్..!

ఐపీఎల్ 19వ సీజన్‌కు ముందు ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఆరంభ సీజన్‌లో ఛాంపియన్‌గా నిలిచిన పేరుతోనే సంతృప్తి చెందుతున్న రాజస్థాన్ రాయల్స్ తమ స్క్వాడ్‌లో భారీ మార్పులకు సిద్ధమవుతోంది. ఇదే అదను అనుకుంటున్న ఫ్రాంచైజీలు ఏకంగా రాజస్థాన్ బృందంలోని ఆరుగురిని ట్రేడ్ పద్ధతిన తమకు ఇచ్చేయాలని కోరుతున్నాయి. వీళ్లలో సంజూ శాంసన్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మిగతా ఐదుగురు ఎవరనేది రాజస్థాన్ వెల్లడించలేదు. కానీ, శాంసన్‌ను దక్కించుకునేందుకు చెన్నై సూపర్ కింగ్స్ విశ్వప్రయత్నం చేస్తోందని సమాచారం.

'మా స్క్వాడ్‌లోని ఆరుగురిని తీసుకొనేందుకు పలు ఫ్రాంచైజీలు ఆసక్తి చూపిస్తున్నాయి. మేము కూడా ఇతర జట్లను మాకు అనువైన ఆటగాళ్లను ట్రేడ్ పద్ధతిన అప్పగించాల్సిందిగా కోరుతున్నాం. త్వరలోనే ముందడుగు పడుతుందనే నమ్మకంతో ఉన్నాం' అని రాజస్థాన్ ఫ్రాంచైజీ సన్నిహిత వర్గాలు వెల్లడించాయి.

పద్దెనిమిదో సీజన్ ముగిసిందో లేదో.. రాజస్థాన్‌కు శాంసన్ గుడ్ బై చెబుతాడానే వార్తలు ఊపందుకున్నాయి. మాజీ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌కు మారుతాడని జోరుగా ప్రచారం జరిగింది. సంజూ కూడా సీఎస్కేకు సంబంధించిన పోస్ట్‌లతో నెట్టింట వైరలయ్యాడు. ఈ నేపథ్యంలోనే శాంసన్‌ను తమకు ట్రేడ్ పద్ధతిన ఇచ్చేయాలని రాజస్థాన్‌ను అభ్యర్తిస్తున్నాడు చెన్నై సీఈఓ కాశీ విశ్వనాథన్. ఒకవేళ శాంసన్, ఫ్రాంచైజీ మధ్య ఏకాభిప్రాయం కుదిరితే అతడు తర్వాతి సీజన్‌లో ఎల్లో జెర్సీతో ఆడడం ఖాయం.

ఎందుకంటే.. రాజస్థాన్‌కు ధ్రువ్ జురెల్ రూపంలో వికెట్ కీపర్, బ్యాటర్ ఉండనే ఉన్నాడు. యువకెరటం రియాన్ పరాగ్ సైతం సారథ్య బాధ్యతలు స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నాడు. కాబట్టి.. శాంసన్ స్థానంలో మరొకరిని ఎంచుకోవడమే ఉత్తమం అని ఫ్రాంచైజీ భావిస్తోంది. ఇటుచూస్తే.. 45 ఏళ్లకు దగ్గరపడుతున్న ధోనీ మరో ఎడిషన్ ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. అందుకే.. అతడి స్థానంలో సంజూను తీసుకోవాలనుకుంటోంది సీఎస్కే. అయితే.. కోల్‌కతా నైట్ రైడర్స్ కూడా శాంసన్ కోసం ప్రయత్నాలు చేస్తోంది. వికెట్ కీపర్లు క్వింటన్ డికాక్, రహ్మనుల్లా గుర్బాజ్‌లను వదిలించు కోవాలనుకుంటున్న ఆ ఫ్రాంచైజీ పవర్ హిట్టరైన ఈ కేరళ క్రికెటర్‌ను పట్టేయాలని వ్యూహాలు రచిస్తోంది. ఇతర ఫ్రాంఛూజీల ఆ తర్వాత ట్రోఫీని ముద్దాడలేకపో

**ఫైనల్ చేరినా..**

ఐపీఎల్ హిట్టర్లలో ఒకడైన శాంసన్ 2021లో రాజస్థాన్ రాయల్స్ సారథిగా ఎంపికయ్యాడు. అతడి కెప్టెన్సీలో రాజస్థాన్ 2022 ఎడిషన్‌లో ఫైనల్ చేరినా కప్ కొట్టలేకపోయింది. ఆ తర్వాత మాత్రం ప్లే ఆఫ్స్‌కు ముందే ఆ జట్టు కథ ముగిస్తూ వస్తోంది. 18వ సీజన్‌లోనూ అంతే. సీజన్ ఆరంభంలో గాయం కారణంగా కీలక మ్యాచ్‌లకు దూరమైన శాంసన్.. ఆఖర్లో జట్టులోకి వచ్చాడు.. కానీ, అప్పటికే రాజస్థాన్ ప్లే ఆఫ్స్ ఆశలు అడుగంటాయి. దాంతో, తీవ్ర నిరాశకు గురైన శాంసన్ 19వ సీజన్‌లో కొత్త జట్టుకు ఆడాలనే ఆలోచనతో ఉన్నట్టుగా తెలుస్తోంది.

'క్రాసింగ్ ది ఎల్లో లైన్, తమిళ బ్రాక్ గ్రౌండ్ పాటలు, 7 ఏఎం అరివు'తో పాటు 'టైమ్ టు మూవ్' అనే పోస్ట్‌లు పెట్టాడు. అవన్నీ గమనిస్తే చెన్నై సూపర్ కింగ్స్‌కు ఆడేందుకు శాంసన్ ఆరాటపడుతున్నాడని తెలుస్తోంది. ఎలాగూ వచ్చే సీజన్‌లో ధోనీ ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో వికెట్ కీపర్, పవర్ హిట్టర్ అయిన సంజూ సీఎస్కేకు ఎంతో పనికొస్తాడు. సో.. అతడు వస్తానంటే సీఎస్కే కళ్లకు అద్దుకోవడం ఖాయం. అయితే.. 19వ సీజన్ ప్రారంభానికి ముందే శాంసన్ రాజస్థాన్‌కే ఆడుతాడా? పసుపు జెర్సీ వేసుకుంటాడా? అనే విషయంలో స్పష్టత రానుంది.



## ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో వేలానికి రిషబ్ పంత్

గత ఏడాది ఐపీఎల్ వేలంలో రిషబ్ పంత్ 27 కోట్లకు అమ్ముడుపోయాడు. లక్నో సూపర్ గెయింట్స్ జట్టు అతన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో కూడా అతను వేలానికి సిద్ధం అయ్యాడు. ఆ వేలంలోనూ అతనికి భారీగా ధర పలికే అవకాశం ఉన్నది. ఢిల్లీ ప్రీమియర్ లీగ్ కోసం మొత్తం 8 జట్లు పోటీపడనున్నాయి. దీంట్లో రిషబ్ పంత్ తో పాటు ఐపీఎల్‌లో ఆడిన కొందరు స్టార్ ఆటగాళ్లు వేలానికి ఉన్నారు. ప్రియాన్ష్ ఆర్యా, దిగ్వేశ్ రాథీ లాంటి క్రికెటర్లు కూడా ఉన్నారు. జూలై 6, 7 తేదీల్లో ఆటగాళ్ల వేలం జరగనున్నది. ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో మరో రెండు జట్లు కొత్తగా జతకూడినట్లు ఇవాళ డీడీసీఏ ప్రకటించింది. దీంతో ఆ జట్ల సంఖ్య 8కి చేరింది. రిషబ్ పంత్, దిగ్వేశ్, ప్రియాన్ష్, ఇశాంత్ శర్మ, ఆయుష్ బదోనీ, హర్షిత్ రాణా, హిమ్మత్ సింగ్, సుయాశ్ శర్మ, మయాంక్ యాదవ్, అనుజ్ రావత్ డీపీఎల్‌లో ఆడనున్నారు.

## కఠినంగా ఉన్నా నమ్మాల్సిందే..! ఈ దశాబ్దంలో బాబర్ ఆజమే టాప్ బ్యాటర్

పాకిస్తాన్ మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్ ఇటీవలి కాలంలో అన్ని ఫార్మాట్లలో దారుణంగా విఫలమవుతున్న విషయం తెలిసిందే. అతను అంతర్జాతీయ క్రికెట్‌లో సెంచరీ సాధించి దాదాపుగా రెండేళ్లవుతుంది. అతని చివరి సెంచరీ కూడా పసికూన నేపాల్‌పై (వన్డేలో) సాధించాడు.

బాబర్ తన చివరి 10 టెస్ట్‌ల్లో, 10 వన్డేల్లో, 10 టీ20ల్లో కనీసం ఒక్క సెంచరీ కూడా చేయలేదు. హాఫ్ సెంచరీలు కూడా ఎనిమిదే చేశాడు (40 ఇన్నింగ్స్‌ల్లో). వరుస వైఫల్యాల కారణంగా కెప్టెన్సీ కోల్పోయిన బాబర్.. ప్రస్తుతం జట్టులో చోటును కూడా ప్రశ్నార్థకంగా మార్చుకున్నాడు.

కెరీర్‌లో అత్యంత గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నా, బాబర్ ఇప్పటికీ టాప్ బ్యాటర్‌గా ఉండటం నమ్మశక్యంగా లేదు. ఈ దశాబ్దంలో (20202025 జూన్ 30 వరకు) అత్యధిక పరుగులు చేసిన అంతర్జాతీయ బ్యాటర్ల జాబితాలో బాబర్ టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. 20202025 మధ్యకాలంలో బాబర్ 202 ఇన్నింగ్స్‌లు ఆడి 8222 పరుగులు చేశాడు. ప్రపంచ క్రికెట్‌లో ఈ దశాబ్దంలో ఎవరూ ఇన్ని పరుగులు చేయలేదు. 2015లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన బాబర్.. ఇప్పటి వరకు మూడు ఫార్మాట్లలో కలిపి 14600 పైచిలుకు పరుగులు చేశాడు. ఇందులో 31 సెంచరీలు, 102 అర్ధ సెంచరీలు ఉన్నాయి.

ఈ దశాబ్దంలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో బాబర్ తర్వాతి స్థానంలో కూడా పాక్ ఆటగాడే ఉండటం విశేషం. ఆ జట్టు వన్డే సారథి మహ్మద్ రిజ్వాన్ ఈ దశాబ్దంలో 191 ఇన్నింగ్స్‌ల్లో 7231 పరుగులు చేశాడు.

బాబర్, రిజ్వాన్ తర్వాతి స్థానాల్లో ఇంగ్లండ్ యువ సంచలనం హ్యారీ బ్రూక్ ఉన్నాడు. బ్రూక్ 2020 నుంచి 2025 జూన్ 30 వరకు 151 ఇన్నింగ్స్‌లు ఆడి 6998 పరుగులు చేశాడు. ఈ ముగ్గురి తర్వాత టీమిండియా స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ ఉన్నారు.



# అందుకే చాలా ఆఫర్స్ వదులుకున్నాను: సప్తమి గౌడ

'తమ్ముడు'లో తాను పవన్ కల్యాణ్ అభిమానినని.. తన పాత్రకు మహిళా ప్రేక్షకులంతా ఫిదా అవుతారంటున్నారు నటి సప్తమి గౌడ నితిన్ ప్రధానపాత్రలో శ్రీరామ్ వేణు దర్శకత్వంలో తెరకెక్కిన 'తమ్ముడు' జులై 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో ఆమె ఓ కీలకపాత్రలో కనిపించనున్నారు. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సప్తమి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఇందులో తాను రత్న అనే పాత్రలో కనిపించనున్నట్లు చెప్పారు. 'తమ్ముడు'గురించి సప్తమి చెప్పిన విశేషాలు తన మాటల్లోనే..

**హార్స్ రైడింగ్ నేర్చుకున్నా..**

'కాంతార' సినిమా తర్వాత దర్శకుడు శ్రీరామ్ వేణు దగ్గర నుంచి ''తమ్ముడు'' కోసం కాల్ వచ్చింది. హైదరాబాద్ వచ్చి లుక్ టెస్ట్ ఇచ్చాను. అది ఓకే అయ్యాక.. డైలాగ్ వెర్షన్ చెప్పారు. హార్స్ రైడింగ్ నేర్చుకోమన్నారు. అరకులో షూటింగ్ చేశారు. నితిన్ భుజానికి గాయం కావడంతో షూటింగ్ కొంత ఆలస్యమైంది. ఈ సినిమాలో వర్క్ చేయడం ఎప్పటికీ మర్చిపోలేని అనుభవం. కొండలు, గుట్టల్లో హార్స్ రైడింగ్ చేయాల్సి వచ్చింది. రోజూ మూడు, నాలుగు గంటలు హార్స్ రైడింగ్ చేయడంతో ఇబ్బందిపడ్డాను. కానీ ఆ సన్నివేశాలన్నీ బాగా వచ్చాయనే సంతృప్తి ఎంతో ఆనందాన్నిచ్చింది.

**పవన్ కల్యాణ్ అభిమానిని..**

అంబరగొడుగు అనే ఊర్లో ఉండే రత్న అనే అమ్మాయి పాత్రనాది. తను పవన్ కల్యాణ్ అభిమాని. నా క్యారెక్టర్‌కు ఒక భిన్నమైన లవ్ స్టోరీ కూడా ఉంటుంది. 'కాంతార' లుక్‌లా ఉన్నా.. క్యారెక్టర్ మాత్రం డిఫరెంట్‌గా ఉంటుంది. ''తమ్ముడు'' సీరియస్ సబ్జెక్ట్.. ఇందులో నా క్యారెక్టర్ ద్వారా ఫన్ క్రియేట్ అవుతుంది. లయ, నితిన్ అంబరగొడుగు వచ్చినప్పుడు వారి జర్నీలో రత్న ఎలా భాగమైంది అనేది ఆసక్తికరంగా ఉంటుంది. వీళ్లిద్దరూ ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ ఉంటారు. రత్న రేడియో జాకీ కాదు. ఈ సినిమా రిలీజ్ అయ్యేలోగా పవన్ కల్యాణ్ నటించిన 'తమ్ముడు' కచ్చితంగా చూస్తాను.

**నిడివి తక్కువ ప్రభావం ఎక్కువ..**

''తమ్ముడు'' సినిమా నటిగా నాకు మంచి పేరు తెస్తుందని ఆశిస్తున్నా. ఈ చిత్రంలో నాది నిడివి ఎక్కువ ఉన్న పాత్ర కాదు.. కానీ ప్రభావవంతమైన పాత్ర. దాన్ని రాసేటప్పుడు బాగా ఎంజాయ్ చేసినట్లు డైరెక్టర్ చెప్పారు. ఈ సినిమాకు ఫస్ట్ సెలెక్ట్ అయిన ఆర్టిస్ట్ నేనే.

**మహిళా ప్రేక్షకులు ఫిదా అవుతారు..**

''తమ్ముడు''లో నాతో పాటు లయ, దిత్య, వర్ష, స్వసిక.. అందరివీ కీలకమైన పాత్రలే. డిఫరెంట్‌గా, పవర్ ఫుల్‌గా ఉంటాయి. లయ గారు స్ట్రిక్ట్ ఆఫీసర్‌గా కనిపిస్తారు. నేను, వర్ష ఫైట్ సీక్వెన్స్‌లోనూ నటించాం. సినిమాల్లో హీరోతో డ్యాన్స్ వేసే హీరోయిన్ క్యారెక్టర్స్ చూస్తుంటాం. కానీ ఇందులో ఫైట్ చేసే హీరోయిన్స్‌ను చూస్తారు. మహిళా పాత్రలను ఇంత బలంగా తెరకెక్కించినందుకు మహిళా ప్రేక్షకులు చాలా హ్యాపీగా ఫీలవుతారు.

**లవ్‌ట్రాక్ బాగుంటుంది..**

ఈ మూవీలో నితిన్‌తో నాకు లవ్ ట్రాక్ ఉంటుంది. మూవీలో రత్న, నితిన్ క్యారెక్టర్ కలవాలని ప్రేక్షకులు కోరుకుంటారు. దిల్ రాజు బ్యానర్‌లో చేయడం ఎంతో ఆనందంగా ఉంది. డైరెక్టర్ శ్రీరామ్ వేణు ఈ మూవీ కోసం ఎంతో కష్టపడ్డారు. మంచి అవుట్‌పుట్ కోసం టీమ్ ఎంతో శ్రమించింది. ఈ సినిమాను థియేటర్‌లో చూస్తేనే బాగా ఎంజాయ్ చేయగలరు.

**ఆ తరహా పాత్రలంటే ఇష్టం..**

నాకు కమర్షియల్ మూవీస్ చేయడం ఇష్టం. ''తమ్ముడు'' ఆ తరహా సినిమానే. 'పుష్ప'లో రష్మిక చేసిన పాత్ర నాకు చాలా నచ్చింది. అలాంటి ఆఫర్స్ వస్తే చేసేందుకు సిద్ధంగా ఉన్నాను. 'కాంతార' సక్సెస్ తర్వాత నాకు అదే తరహా పాత్రలు వచ్చాయి. అందుకే చాలా మూవీస్ వదులుకున్నాను. ఎక్కువ చిత్రాల్లో మీకు నేను కనిపించకపోవడానికి కారణమదే. డిఫరెంట్ రోల్స్ వస్తే తప్పకుండా చేస్తా. ప్రస్తుతం తెలుగులో మరో రెండు చిత్రాలతో పాటు తమిళంలో, కన్నడలో మూవీస్ చేస్తున్నా. వాటి వివరాలు త్వరలో వెల్లడిస్తా. భాషతో సంబంధం లేకుండా అన్ని చిత్రాల్లో నటించాలని కోరుకుంటున్నా.





# దిల్ రాజు అలా.. శిరీష్ ఇలా.. అసలేంటీ మ్యాటర్?

ఇప్పుడు దిల్ రాజు, శిరీష్ బ్రదర్స్ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారిపోయారు. నిజానికి ఈ దిల్ రాజు నిర్మాణంలో శిరీష్ సహనిర్మాతగా వ్యవహరించిన తమ్ముడు సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే ఈ అన్నా తమ్ముళ్లు మీడియాకి ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. అయితే ఈ సినిమా విషయం గురించి మాట్లాడే కంటే పాత విషయాల గురించి మాట్లాడడానికి ఇంటర్వ్యూలలో ఆసక్తి ఎక్కువగా కనబరుస్తున్నారు. ఈ నేపథ్యంలో వీరి కాంపౌండ్ నుంచి చివరిగా వచ్చి డిజాస్టర్‌గా నిలిచిన గేమ్ చేంజర్ గురించి పెద్ద ఎత్తున ప్రశ్నలు వీరిద్దరికీ వస్తున్నాయి.

నిజానికి దిల్ రాజు వరుసగా ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. కానీ శిరీష్ మాత్రం ఒకే ఒక్క ఇంటర్వ్యూ ఇచ్చారు. దిల్ రాజు వరుస ఇంటర్వ్యూలతో ఎంత కమ్యూనికేషన్ బిల్డ్ చేసుకుంటూ వచ్చారో, ఒకే ఒక్క ఇంటర్వ్యూతో శిరీష్ ఆ అంతటినీ కూల్చేశారనే చెప్పాలి. నిజానికి దిల్ రాజు మాట్లాడుతూ రామ్ చరణ్ తనకు చాలా సపోర్ట్ చేశాడని, సంక్రాంతికి తమ సినిమా రిలీజ్ అవ్వడానికి కారణం రామ్ చరణ్ అని చెప్పుకొచ్చారు. ఆయనే లేకుంటే ఇంకా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడేదని చెప్పుకొచ్చారు. అంతేకాకుండా ఆయనకు ఒక డిజాస్టర్ ఇచ్చిన రిగ్రెట్ తనకు ఉందని, ఆయనతో మరో సినిమా చేయాలనే ప్రయత్నాలు చేస్తున్నామని కూడా తాజాగా వెల్లడించారు.

కానీ శిరీష్ మాత్రం తాము ఇబ్బంది పడుతున్నప్పుడు రామ్ చరణ్ కానీ శంకర్ గానీ కాల్ చేయలేదని, కనీసం కాల్ చేసి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. దీంతో శిరీష్ ను మెగా అభిమానులు టార్గెట్ చేస్తున్నారు. శిరీష్ మాటలు కరెక్ట్ కాదని, ఆర్ఆర్ఆర్ లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చరణ్ వేరే సినిమాల జోలికి వెళ్లకుండా మీకు మాట ఇచ్చాడనే కారణంగా గేమ్ చేంజర్ పూర్తి చేస్తే, ఇప్పుడు ఆయన మీద అభాండాలు వేయడం కరెక్ట్ కాదని అంటున్నారు. నిజానికి శిరీష్ అన్న మాటల్లో తప్పేమీ లేదు. ఎందుకంటే అలాంటి భారీ డిజాస్టర్ చూసిన తర్వాత డైరెక్టర్ లేదా హీరో నుంచి కనీసం కాల్ ఎదురు చూస్తారు. వారు కనక చేసి మాట్లాడి ఉంటే బాగుండేది. అయితే అప్పటికే అలాంటి డిజాస్టర్‌తో ఇబ్బంది పడుతున్న రామ్ చరణ్‌కు నిర్మాతలే కాల్ చేసి ఉంటే బాగుండేది కదా అని అభిమానులు కూడా కామెంట్లు చేస్తున్నారు. మొత్తం మీద దిల్ రాజు కామెంట్స్ ఒకలా ఉంటే, శిరీష్ కామెంట్స్ దానికి భిన్నంగా ఉండడంతో ఇప్పుడు సోషల్ మీడియాలో రామ్ చరణ్ అభిమానులు అందరూ శిరీష్‌ని టార్గెట్ చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.

# పెళ్లి కుదరడంతో అమితాబ్ సినిమాను తిరస్కరించా: నటి మధుబాల



ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా సూపర్‌హిట్ సినిమాలతో అలరించారు నటి మధుబాల. 1999లో వివాహం చేసుకున్న తర్వాత వెండితెరకు దూరమైన ఆమె.. మళ్లీ సహాయ నటి పాత్రలతో పలకరిస్తున్నారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నటనకు విరామం తీసుకోవడం గురించి మాట్లాడారు. దక్షిణాదిలో నటించిన తర్వాత బాలీవుడ్ సినిమాల్లో చేయడం సౌకర్యంగా ఉండేది కాదన్నారు. ''1997 తర్వాత నేను చేసే పాత్రలు ఆసక్తికరంగా అనిపించలేదు. ఉత్సాహంగా సెట్స్‌కు వెళ్లాలనిపించేది కాదు. దక్షిణాదిలో గొప్పగొప్ప దర్శకులతో పనిచేశాను. ఆ తర్వాత బాలీవుడ్‌లో నటించాను. ఇక్కడ కొన్ని చిత్రాల్లో వర్క్ చేశాక నాకు వింత అనుభవాలు ఎదురయ్యాయి. ఒక నటిగా నాకు సెట్స్‌కు వెళ్లడం బాధగా అనిపించేది. ఒకప్పుడు ఎప్పుడూ సెట్స్‌లో ఉండాలని కోరుకున్న నేను.. కొంతకాలానికి సెట్స్‌లో ఉండాలంటేనే చిరాకు అనిపించడం ప్రారంభించింది. అందుకే విరామం తీసుకుందామనుకున్నాను'' అని చెప్పారు.

ఇక అమితాబ్ సినిమాను తిరస్కరించడం గురించి మాట్లాడుతూ.. ''సినిమాలకు కొన్ని రోజులు విరామం తీసుకుందామని నిర్ణయించుకున్నప్పుడే ప్రేమ నా జీవితంలోకి ప్రవేశించింది. వివాహం నిశ్చయమైంది. ఆ సమయంలోనే అమితాబ్ సినిమాలో అవకాశం వచ్చింది. అప్పటికే పెళ్లి తేదీ ఫిక్స్ కావడంతో ఆ సినిమాను తిరస్కరించాను. నా మేనేజర్ కూడా ఒకసారి నా ఆలోచనను పునఃపరిశీలించుకోవాలని కోరారు. నేను అదే మాట మీద ఉండడంతో ఆ అవకాశం సౌందర్యను వరించింది'' అని చెప్పారు. అదే 'సూర్యవంశం' మూవీ. తెలుగులో ఈ మూవీని వెంకటేశ్‌తో తీసిన సంగతి తెలిసిందే.

1991లో తమిళ సినిమాతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు మధుబాల. ఆ తర్వాత హిందీ, మలయాళం, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో వరుస సినిమాలు చేసి ఆకట్టుకున్నారు. 1999లో వివాహం అనంతరం ముంబయిలో స్థిరపడిన మధు నటనకు విరామం తీసుకున్నారు. మళ్లీ కొన్నేళ్ల నుంచి సహాయ నటి పాత్రల్లో నటిస్తున్నారు. ఇటీవల వచ్చిన 'కన్నప్ప' సినిమాలో అతిథి పాత్రలో కనిపించిన విషయం తెలిసిందే.



# పాకీజాకి పవన్ కళ్యాణ్ ఆర్థిక సాయం.. జీవితాంతం రుణపడి ఉంటానంటూ కామెంట్

చాలామంది సినీ నటుల జీవితాలను చూసినప్పుడు వారు విలాసంగా ఉంటారని అనిపిస్తుంది. అయితే, అందరికీ జీవితం ఒకేలా ఉండదు. విభిన్న పాత్రలతో ప్రేక్షకులను నవ్వించినవారే ఇప్పుడు తీరని బాధలతో జీవితం గడుపుతున్నారు. 1990లో కామెడీ పాత్రలతో తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా గుర్తుండిపోయిన నటి పాకీజా, అసెంబ్లీ రౌడీ సినిమాలో బ్రహ్మానందంతో కలసి చేసిన కామెడీ ట్రాక్ ఇప్పటికీ నవ్వులు పూయిస్తుంది. అయితే ప్రస్తుతం ఆమె తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు. జీవనోపాధి లేక, ఇల్లు లేక, తినడానికి తిండి లేక జీవితం గడుపుతున్నట్లు ఆమె గతంలో ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో వెల్లడించారు. తాజాగా, ఆమె తన ఆవేదనను మరోసారి బహిర్గతం చేస్తూ.. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను ఆదుకోవాలని వేడుకుంది. ''నాకు భర్త, పిల్లలు లేరు. మూడేళ్లుగా షూటింగ్‌లు లేవు. చెన్నై నుంచి ఊరికి వచ్చేశాను. తినడానికి తిండి లేక ఇబ్బందులు పడుతున్నాను. నెల నెలా ఆసరా కోసం పెన్షన్ లాంటి సాయం కావాలి అంటూ ఆమె కంటతడి పెట్టారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆ వీడియోను చూసిన వెంటనే జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించి, పాకీజాకు రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించారు. మంగళవారం మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో పవన్ కళ్యాణ్ తరపున ప్రభుత్వ విప్ హరిప్రసాద్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా ఆ సాయం అందించారు. పవన్ కళ్యాణ్ సహాయం పట్ల పాకీజా భావోద్వేగానికి గురవుతూ.. ఆయన నన్ను ఆదుకున్నారు. ఆయనకి జీవితాంతం రుణపడి ఉంటాను. నా కష్టం తెలిసిన వెంటనే స్పందించిన ఆయన నిజమైన నాయకుడు అంటూ కంటతడి పెట్టారు. తాను కష్టాల్లో ఉన్నానని తెలిసిన వెంటనే తక్షణం స్పందించిన పవన్ కళ్యాణ్‌కి ఎలా థ్యాంక్స్ చెప్పాలో అర్థం కావడం లేదు..

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: GATTIMI SATISH KUMAR, RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465